




ఐజీ పాలరాజు

వేటు పడింది..



ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ఎన్నికల వేళ వైసీపీకి షాక్

- గుంటూరు ఐజీ, పల్నాడు ఎస్పీ బదిలీ
- కంగుతిన్న పోలీసులు.. యంత్రాంగంలో కలకలం
- అధికార పార్టీతో అంట కాగినందుకు తగిన మూల్యం

పోలీసింగ్ మరిచారు.. విధి నిర్వహణలో పక్ష పాతం.. అధికార పార్టీకి అండదండలు.. హింస చెల రేగుతున్నా పట్టించుకోకపోవడం.. ప్రతి పక్ష పార్టీల ఫిర్యాదులపై నిర్లక్ష్యం.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా మారని ధోరణి.. ప్రధానమంత్రి మోదీ పాల్గొనే ప్రజాగళం సభ విఫలయత్నానికి ఎత్తులు.. ఇలా ఎన్నోన్నో రకాలుగా వైసీపీ అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు. అయినా వెరవకుండా ముఖ్యమంత్రి అండదండలు ఉన్నంతవరకు తమను ఎవరూ ఏమీ చేయలేరని, వచ్చే ఎన్నికల్లో అధికార వైసీపీని ఎలాగైనా గట్టెక్కించాలని కాచుకుకూర్చున్న ఐపీఎస్‌లపై ఎన్నికల సంఘం వేటువేసింది. ఎన్నికల సమీపిస్తోన్న వేళ ఇది వైసీపీకి గట్టి షాకే. గుంటూరు రేంజి ఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. వీరి బదిలీతోనైనా పోలీసు అధికారులు వారి పనితీరు మార్చుకుంటారని పలువురు ఎదురు చూస్తున్నారు.

నరసరావుపేట, గుంటూరు, ఏప్రిల్ 2: ఐపీఎస్‌లు పక్షపాతం లేకుండా అందరికీ సమన్యాయం చేయాలి. కాని బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అధికార పార్టీతో అంటకాగుతూ వారు చెప్పిందే వేదమన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. అధికార పార్టీ మత్తులో జోగుతున్నారనేది ప్రత్యక్షంగా దేశ ప్రధానికే రుచి చూపించిన ఐపీఎస్‌లకు కొంచెం ఆలస్యమైనా గట్టి షాకే తగిలింది. ఐజీ, పల్నాడు ఎస్పీలపై వేటు పోలీసు శాఖలో సంచలనం కలిగించగా, ఎన్నికల అధికారుల్లో కలకలం సృష్టించింది. అధికార పార్టీకి అనుకూల వైఖరి అవలంబిస్తున్నట్లు ఆధారాలతో సహా రుజువు కావడంతో గుంటూరు రేంజ్ ఐజీ జీ పాలరాజుతో పాటు రేంజి పరిధిలోని పల్నాడు ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి, ప్రకాశం ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డిలను తక్షణం బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడం అటు రాజకీయ వర్గాలతో పాటు ఇటు పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. గతనెల 17న చిలకలూరిపేట పరిధిలోని బొప్పూడి వద్ద జరిగిన ప్రజాగళం సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరుకాగా దానిని విఫలయత్నం చేసే బాధ్యత పలువురు ఐపీఎస్‌లు భుజాన వేసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వేదిక ముందు డీ జోన్‌లోకి ఎవరినీ అనుమ తించకూడదు. అటువంటిది ప్రధాని వేదికపైకి వచ్చిన తర్వాత పెద్ద గుంపు చొచ్చుకు రావడం, వీవీఐపీ జోన్‌లోకి సైతం బాటిళ్లు విసిరారు. మైకుల స్టాండ్ పైకి పెద్ద సంఖ్యలో జనం ఎక్కడం అది కూలిపోతే అత్యంత ప్రమాదకరమని తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లుగా పోలీసులు వ్యవహరించడం తదితరాలు భద్రత వైఫల్యానికి నిదర్శనంగా నిలిచాయి. మరోవైపు ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో అనేకసార్లు మైకు అంతరాయం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం కూడా ఉద్దేశపూర్వకంగా జరిగినట్లుగానే ఇంటిలిజెన్స్ వర్గాలు అంచనాకు వచ్చాయి. ప్రధాని పాల్గొన్న ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యం కేంద్ర హోం శాఖ వర్గాలను సైతం షాక్‌కు గురి చేసింది. ప్రజాగళం షెడ్యూల్ లో భాగంగా ప్రధానికి జ్ఞాపికలు అందజేయాల్సి ఉంది. రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఇవ్వాల్సి ఉండగా ఆయన జ్ఞాపికలతో వస్తుండగా పోలీసు అధికారులు ఆయనను వేదిక ఎక్కకుండా అడ్డుకున్నారు. దీంతో కార్యక్రమం నిర్వహణలో ఒక భాగమైన జ్ఞాపికలు ప్రధానికి, ఇతర ప్రముఖులకు ఇవ్వకుండానే సభ పూర్తి కావడం విస్మయానికి గురి చేసింది. మరోవైపు ప్రజాగళం సభకు వచ్చే పార్టీ శ్రేణులపై అను చితంగా వ్యవహరించడం, వేలా దిగా తరలివస్తున్న వాహనా లను ట్రాఫిక్‌కు ఇబ్బంది లే కుండా క్రమబద్ధీకరిం చడం లోనూ పోలీసులు పూర్తిగా ఉద్దేశపూర్వకంగా చేతు లెత్తేసినట్లు ఆరోపణలు వచ్చాయి.



దహనమవుతున్న టీడీపీ నేత కారు (ఫైల్)

దీనిపై కేంద్ర నిఘా వర్గాలు అదే రోజు తీవ్రంగా స్పందించి అక్కడ నెలకొన్న పరిస్థితులు, పోలీసుల తీరుపై పక్కా ఆధారాలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ప్రమేయం లేకుంటే ఇటువంటి తీవ్ర ఆరోపణలు వచ్చినప్పుడు తక్షణం రాష్ట్ర ప్రభుత్వం వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని ఉండేది. కానీ వారిపై కనీసం ఈగ కూడా వాలలేదు. వారిని హెచ్చరించిన దాఖలాలు కూడా లేవు. ఇది ఎన్నికల తరుణంలో కేవలం ట్రయల్ మాత్రమేనని ఎన్నికల ప్రక్రియ సమీపించే కొద్దీ తమ ప్రతాపం చూపుతామన్నట్లుగా ఆయా పోలీస్ ఉన్నతాధికారులు వ్యవహరిస్తుం డటంతో టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు నేరుగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలను స్వయంగా పిలిపించుకుని ప్రధాని సభలో భద్రత వైఫల్యంపై వివరణ తీసుకుంది. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక కూడా పంపింది. ఈ ముగ్గురు ఎస్పీలను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగిన గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజుపై కూడా అధికార వైసీపీ ముద్ర ఉండటం వల్లే ఆయన కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఐజీ కూడా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఆ పార్టీ నేతలు ఏది చెబితే అది చేసుకుంటూ పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ప్రజాగళం సభకు జనాన్ని తీసుకువెళ్లారనే కారణంతో గిద్దలూరు మండల పరిధిలో మునయ్య అనే టీడీపీ కార్యకర్తను దారుణంగా హత్య చేయడం, ఆ కేసు విషయంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సరిగా స్పందించలేదనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఒక్క గుంటూరు రేంజ్ లోనే నలుగురు ఐపీఎస్‌లపై వేటుపడింది. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే వారు ఏ స్థాయి వారు అయినా సరే ఇదే గతి పడుతుందని ఎన్నికల సంఘం ఏకంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

పల్నాడు ఎస్పీపై తొలి నుంచి ఆరోపణలు

పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డిపై తొలి నుంచి పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఆయన అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తల హత్యలు, హత్యాయత్నాలు, తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు వంటి వాటిలో ఎస్పీ స్థాయి అధికారి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి చెప్పినట్లుగానే ఎస్పీ వ్యవహరిస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును నంద్యాలలో అరెస్ట్ చేసి తీసుకు వెళుతున్న తరుణంలో చిలకలూరిపేట వద్ద టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేసిన సందర్భంలో ఎస్పీ దారుణంగా వ్యవహరిం చిన తీరు సోషల్ మీడియాలో అప్పట్లో వైరల్‌గా మారింది. లాఠీలతో విరుచుకుపడి దొరికిన వారిని దొరికినట్లు బాది ప డేశారు. ఎన్నికల కోడ్ అమ ల్లోకి వచ్చిన అనంతరం ఇటీవల మాచర్లలో ఇంటి వద్ద ఉన్న టీడీపీ నేత కారు తగలబెట్టిన అంశంలో ఎస్పీ తీరుపై విమర్శలు వచ్చాయి. ఈ సంఘటన నేపథ్యంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ వివరణ కోరింది. ఈ సందర్భంగా సమస్యాత్మకమని తెలిసి శాంతి భద్రతలను నియంత్రించలేదని ఎస్పీని ఎన్నికల కమిషన్ నిలదీసింది. కోడ్ వచ్చాక రాజకీయ హింస జరగడంపై ఎస్పీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. హింసాత్మక ఘటనలు జరగకూడదని ఎస్పీకి స్పష్టంగా చెప్పింది. అయితే ఎన్నికల కమిషన్ వద్ద మార్చి 21న ఎస్పీ హాజరైన మరుసటి రోజు ఇదే నియోజకవర్గంలో జనసేన నేతల పై వైసీపీ శ్రేణులు దాడులు జరిగాయి. గతంలో కూడా మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ వర్గీయులపై దాడుల పరంపర, వైసీపీ అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయాయి. అనేక హింసా త్మక సంఘటనలు జరుగుతున్నా పోలీసులు అధికార పార్టీకి అండగా ఉన్నారన్న ఆరోపణలు న్నాయి. ఏ సంఘటన జరిగినా రవిశంకర్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలను విపక్షాల నుంచి ఎదుర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు, కోడి పందాలు అరికట్టడంలో కూడా ఆయన విఫలమయ్యారన్న విమర్శ లున్నాయి. క్రికెట్ బెట్టింగ్‌ల విషయంలో బాధితుల కుటుంబ సభ్యులు ఎస్పీకి ఫిర్యాదు ఇచ్చినా స్పందించలేదన్న విమర్శ లున్నాయి. ఎస్పీ పనితీరుపై మొదటి నుం చి విపక్షాలు ఆరోపణలు, విమర్శలు చేస్తూనే ఉన్నా ప్రభుత్వ పెద్దల్లో స్పందన లేదు. చివరకు ఎన్నికల సంఘం జోక్యంతో ఆయనపై బదిలీ వేటు పడింది.



వైసీపీ నేతల దాడితో ధ్వంసమైన జనసేన నేతల వాహనం (ఫైల్)

నేటికి రెండేళ్లు

గ్రూప్-1 ద్వారా డీఎస్పీగా ఎంపికై ఉద్యోగోన్నతి ద్వారా ఎస్పీగా రవి శంకర్‌రెడ్డి పల్నాడుకు వచ్చారు. పల్నాడు జిల్లాకు తొలి ఎస్పీగా రవిశంకర్‌రెడ్డి ఏప్రిల్ 3 2022న బాధ్యతలు స్వీకరించారు. అంటే ఆయన ఎస్పీగా వచ్చి నేటికి(బుధవారం) సరిగ్గా రెండేళ్లు అవుతుంది. రెండేళ్లకు ఒక్క రోజు ముందు ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం చర్యలతో బదిలీ అయ్యారు. రవిశంకర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు ఎస్పీ ఇన్‌చార్జి బాధ్యతలను ఏఎస్పీ రాఘవేంద్రరావుకు అప్పగించారు. ఎస్పీపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడంతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి విధుల్లో ఉంటే ఎన్నికలు సజావుగా జరిగి ఉండేవి కాదని వారు పేర్కొన్నారు.

చంద్రబాబు పర్యటన ఖరారు



6న పెదకూరపాడు, సత్తెనపల్లిలో ప్రజాగళం

నరసరావుపేట, ఏప్రిల్ 2: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పల్నాడు జిల్లా పర్యటన ఖరారైంది. ప్రజాగళం పేరుతో చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ క్రమంలో ఆయన 6న పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు వివరాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మంగళవారం ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పెదకూరపాడు, సాయంత్రం 5 గంటలకు సత్తెనపల్లిలో ప్రజాగళం సభల్లో చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. చంద్రబాబు సభలకు సంబంధించిన ఏర్పాట్లను పెదకూరపాడులో పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణలు పర్యవేక్షిస్తున్నారు. సభలకు భారీగా జనసమీకరణకు నేతలు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో ఈ రెండు నియోజక వర్గాల్లో చంద్రబాబు పర్యటన, సభలు విజయవంతం అయ్యాయి. అంతకు మించి ఈ సారి ప్రజాగళం సభలను విజయవంతం చేయాలని నేతలు నిర్ణయించారు. తొలుత చంద్రబాబు వినుకొండలో పర్యటిస్తారని పార్టీ కార్యాలయం నుంచి సమాచారం అందింది. అయితే ఆ పర్యటన వాయిదా పడిందని జీవీ ఆంజనేయులు తెలిపారు. త్వరలోనే వినుకొండ పర్యటన తేదీ ఖరారవుతుందని చెప్పారు.

పన్ను వసూలు అంతంతే..!

- చతికిల పడ్డ మునిసిపాల్టీలు
- పురాల్లో పన్ను వసూలు 43.17 శాతమే
- పన్ను వసూలు లక్ష్యం రూ.549.79 కోట్లు
- వసూలు రూ.236.82 కోట్లు
- ఇంకా బకాయిలు రూ.312.97 కోట్లు
- కలసిరాని వడ్డీ రాయితీ
- రాష్ట్రస్థాయిలో అద్దంకి ప్రథమ.. వినుకొండ ద్వితీయ స్థానం

ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మునిసిపాల్టీలు చతికిలపడ్డాయి. పన్ను చెల్లించేందుకు పురపౌరులు ముందుకు రాలేదు. వడ్డీ మాఫీ అమలు కూడా కలసిరాలేదు. గత ఏడాది కంటే తక్కువుగా పన్ను వసూలైంది. గత ఏడాది 54.86 శాతం పన్ను వసూలు కాగా ఈ ఏడాది 43.17 శాతం పన్ను వసూలైంది. ఆస్తి, తాగునీటి పన్ను వసూలు లక్ష్యం రూ.549.79 కోట్లు, కాగా రూ.236.82 కోట్లు పన్ను వసూలైంది. ఇంకా ఆస్తి, తాగునీటి పన్ను బకాయిలు భారీగా పేరుకు పోగా రూ.312.97 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉంది. అద్దంకి, వినుకొండ మునిసిపాల్టీలు పన్ను వసూలులో రాష్ట్రస్థాయిలో మొదటి రెండుస్థానాల్లో నిలిచాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీ చిట్ట చివరన నిలిచింది.

మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా..

మునిసిపాలిటీ	వసూలు లక్ష్యం (కోట్లలో)	వసూలు (కోట్లలో)	శాతం
పల్నాడు జిల్లా			
• నరసరావుపేట	17.86	10.34	57.90
• చిలకలూరిపేట	17.06	5.81	34.10
• వినుకొండ	5.14	4.38	85.20
• సత్తెనపల్లి	7.71	4.99	64.70
• మాచర్ల	5.98	3.15	52.70
• పిడుగురాళ్ళ	5.72	3.95	69.00
• దాచేపల్లి	2.18	1.96	90.10
• గురజాల	1.56	0.94	60.50
గుంటూరు జిల్లా :			
• గుంటూరు	279.84	110.33	39.40
• తెనాలి	26.85	16.62	61.90
• మంగళగిరి, తాడేపల్లి	37.24	25.75	69.14
• పొన్నూరు	6.12	3.93	64.20
బాపట్ల జిల్లా :			
• రేపల్లె	5.71	4.32	75.50
• బాపట్ల	9.80	5.56	56.70
• చీరాల	12.41	8.98	72.30
• అద్దంకి	4.55	3.68	80.90

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో రూ.420.01 కోట్లు ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.214.39 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను రూ.103.38 కోట్లు కాగా రూ.22.97 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను రూ.205.62 కోట్లు, తాగునీటి పన్ను రూ.80.41 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఆస్తి పన్ను 51.04 శాతం, నీటిపన్ను 22.21 శాతం వసూలైంది. పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను 35 శాతం లోపే ఉంది. ఈ జిల్లాకు సంబంధించి మునిసిపాల్టీలలో రూ.63.17 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.35.27 కోట్లు వసులైంది. 55.8 శాతం ఆస్తి పన్ను వసూలు చేశారు. తాగునీటి పన్ను రూ.19.62 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. నీటి పన్ను రూ.5.19 కోట్లు వసూలు చేయగా వసూలు శాతం 26.45గా ఉంది. విను కొండ ముని సిపాల్టీ 85.20 శాతం ఆస్తి పన్ను వసూ లు చేసి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. వసూలులో ముందు వరుసలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బకా యిలు భారీగా పేరుకు పోయాయి. వడ్డీ మా ఫీ చేసినా బకాయిదారులు స్పందించలేదు.



గుంటూరు కార్పొరేషన్ సహా జిల్లాలో రూ.350.04 కోట్లు ఆస్తి పన్ను, రూ.156.07 కోట్లు నీటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఆస్తి పన్ను రూ.77.68 కోట్లు, నీటి పన్ను రూ.15.63 కోట్లు వసూలు చేశారు. ఆస్తిపన్ను 44.58 శాతం, నీటిపన్ను 20.12 శాతం వసూలైంది. ఈ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం కార్యాలయాలకు సంబంధించి దాదాపు రూ.8 కోట్లు పన్ను బకాయి పేరుకుపోయింది. వీటి నుంచి పన్ను వసూలు కాలేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాల యాల పన్ను బకాయి రూ.30 కోట్లకు పైగా ఉండగా నామమాత్రంగానే పన్ను వసూ లైంది. గుంటూరు కార్పొరేషన్ పన్ను వసూలులో తీవ్ర నిర్లక్ష్యం నెలకొంది. 39.40 శాతమే పన్ను వసూలైంది.బాపట్ల జిల్లాలో మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను రూ.32.48 కోట్లు లక్ష్యం కాగా రూ.22.51 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను 6.80 కోట్లకు రూ.2.15 కోట్లు వసూ లైంది. ఆస్తి పన్ను 69.32 శాతం, నీటి పన్ను 31.73 శాతంగా నమోదైంది. బాపట్ల మున్సిపాల్టీ మునిసిపాల్టీలో 56.70 శాతం మాత్రమే పన్ను వసూలు చేశారు. అద్దంకి మునిసిపాల్టీ 80.90 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులకు, పన్ను వసూలుకు పొంతన లేదు. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సం బంధించిన పన్ను పక్కదారి పడుతోంది. ఉన్న ఆదాయ వనరులను వినియోగించుకోవడంలో మునిసిపల్ అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్ను ఏటా ఒక్కో మునిసిపాలిటీ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతోంది.

ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ ఆదాయాన్ని మునిసిపాలిటీలు రాబట్టుకోలేక పోతున్నాయి. అభివృద్ధి పనుల నిర్వహణ, కాంట్రాక్ట్ కార్మికుల, ఉద్యోగుల జీతాల చెల్లింపులు పుర పాలక సంఘాల్లో జాప్యం జరుగుతోంది. సాధారణ ని. దుల నుంచి చేపట్టే పనులుబిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుం డటంతో పనులు నిలిచి పోతున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(బుధవారం)
సహోరీ (ఉదయం) 4.44 (గురువారం)

నేడు తెనాలికి జనసేనాని

- పవన్‌కల్యాణ్ పర్యటన విజయవంతం చేద్దాం
- జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులకు మనోహర్ పిలుపు

తెనాలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలిసారి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం తెనాలి రానున్నారు. ఆయన పర్యటన ఏర్పాట్లు ఒక కొలిక్కి వచ్చాయి. ప్రత్యేక హెలికాప్టర్ లో పవన్‌కల్యాణ్ సుల్తానాబాద్ చేరుకుంటారు. అక్కడి నుంచి వారాహి వాహనంలో తెనాలి పట్టణంలో పర్యటించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం మార్కెట్ సెంటర్‌లో జరిగే సభలో పాల్గొంటారు. ఇప్పటికే రూట్‌మ్యాప్‌ను నాయకులు సిద్ధం చేశారు. ఇక వారాహి వాహనం మంగళవారం రాత్రికే తెనాలికి చేరుకుంది. దీనిని చూసేందుకు పవన్ అభిమానులు పెద్దసంఖ్యలో గుమికూడారు. పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చెయ్యాలని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలి రావాలని కోరారు. సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ పనులను మనోహర్ పరిశీలించారు. హెలిప్యాడ్ దగ్గర నుంచి ర్యాలీగా ఎట్లా వెళ్లాలి? రూట్ మ్యాప్, జనం రద్దీ వంటివాటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై కొద్దిసేపు మిగిలిన నాయకులతో సమీక్షించారు. తర్వాత బహిరంగసభ జరగనున్న మార్కెట్ సెంటర్‌ను కూడా పరిశీలించారు. జనానికి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సభ జరగాలని నేతలకు ఆయన సూచించారు. ఎన్నికల నేపథ్యంలో తొలిసారి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పవన్ పర్యటించనుండటంతో గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి కూడా జనం భారీగా రావచ్చనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవన్ పర్యటనే ఒక పండుగలా ఉంటుందని మనోహర్ చెప్పారు. తెనాలి అభివృద్ధికి చేపట్టబోయే కార్యాచరణపైపవన్ నుంచి హామీ ఉంటుందనే ఆశాభావాన్ని పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. మనోహర్‌తోపాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు స్థానిక నాయకులు ఏర్పాట్ల పరిశీలనలో పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మనోహర్, గాదె తదితరులు




తెనాలి చేరుకున్న వారాహి వాహనం

దిక్సూచి DIKSUCHI

ఐసర్‌లో బీఎస్, ఎంఎస్

ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు నోటిఫికేషన్



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్ సంస్థలు) అందిస్తున్న 'బీఎస్ ఎంఎస్' డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఉద్దేశించిన ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐసర్ ఏటీ)2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షని భోపాల్ ఐసర్ నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా తిరుపతి సహా భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, బెర్హంపూర్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఎస్-ఎంఎస్ (సైన్సెస్) ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. భోపాల్ క్యాంపస్‌లో నాలుగేళ్ల వ్యవధిగల బీఎస్(ఇంజనీరింగ్ సైన్సెస్/ఎకనామిక్ సైన్సెస్) డిగ్రీ ప్రోగ్రామ్ కూడా ఉంది. ఇవి పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. బెంగళూరు ఐఐఎస్సీ అందిస్తున్న బీఎస్(రీసెర్చ్), మద్రాస్ ఐఐటీ అందిస్తున్న బీఎస్(మెడికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కూడా ఐసర్ ఏటీ 2024 టెస్ట్ స్కోర్‌ను అనుమతిస్తారు.

విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ అండ్ డేటా సైన్సెస్, ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్సెస్/ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఎకనామిక్ సైన్సెస్, ఇంజనీరింగ్ సైన్సెస్ (కెమికల్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్), జియోలాజికల్ సైన్సెస్, ఇంటిగ్రేటెడ్ అండ్ ఇంటర్‌డిసిప్లినరీ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.

క్యాంపస్‌లు-సీట్లు: బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి తిరుపతిలో 275, తిరువనంతపురంలో 320, పుణెలో 288, మొహాలీలో 250, కోల్‌కతాలో 250, భోపాల్‌లో 255, బెర్హంపూర్‌లో 180 చొప్పున మొత్తం 1818 సీట్లు; భోపాల్ క్యాంపస్ అందిస్తున్న బీఎస్ ప్రోగ్రామ్‌లో ఇంజనీరింగ్ సైన్సెస్ 84, ఎకనామిక్ సైన్సెస్ 31 చొప్పున మొత్తం 115 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి 2022, 2023 సంవత్సరాల్లో ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు; మూడేళ్ల డిప్లొమా ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు; 2024లో చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్ అభ్యర్థులకు ప్రథమశ్రేణి మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. చివరి సంవత్సర మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకొంటారు. బీఎస్ ప్రోగ్రామ్‌నకు మాత్రం మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ అంశాలనుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు ఎన్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఇస్తారు. అన్ని సబ్జెక్ట్‌లకూ సమాన వెయిటేజీ ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. మొత్తం మార్కులు 240. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఈ టెస్ట్‌ను హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహిస్తారు. సంస్థ నిర్దేశించిన కటాఫ్ మేరకు ర్యాంక్‌లు ప్రకటిస్తారు. ఆప్టిట్యూడ్ టెస్ట్ సిలబస్, గత ప్రశ్నపత్రాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 13
- **కరక్షన్ విండో ఓపెన్:** మే 16, 17
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 1
- **ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ:** జూన్ 9
- **ఫైనల్ కీ విడుదల:** జూన్ 21
- **ఐఏటీ ఫలితాలు విడుదల:** జూన్ 25
- **కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్:** జూన్ 26 నుంచి జూలై 1 వరకు
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 2 నుంచి 5 వరకు
- **మొదటి రౌండ్ అడ్మిషన్స్ లిస్ట్ విడుదల:** జూలై 7
- **వెబ్‌సైట్:** iiseradmission.in

పరిశోధనలు



నైసర్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)- ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్‌లు, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్

అర్హత: బయలాజికల్ సైన్సెస్‌కు డిగ్రీ(బయాలజీ/లైఫ్ సైన్సెస్) లేదా బీఫార్మసీ/బీవీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్/ఎంబీబీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కెమికల్ సైన్సె స్‌కు డిగ్రీ(కెమికల్ సైన్సెస్) లేదా కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; మేథమెటికల్ సైన్సెస్‌కు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్‌కు ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. విభాగాన్ని అనుసరించి జామ్ 2024/గేట్ 2024/ఎన్‌బీహెచ్‌ఎం/జెస్ట్ 2024/సీఎస్ఐఆర్ నెట్/యూజీసీ నెట్ అర్హత పొంది ఉండాలి.

ఫెలోషిప్: మొదటి ఏడాది నెలకు రూ.21,000ల నగదు; బుక్ అలవెన్స్ కింద రూ.25000 చెల్లిస్తారు. తరవాత రెండేళ్లు నెలకు రూ.31000 ఇస్తారు. నాలుగో ఏడాది నుంచి ఏడో ఏడాది వరకు నెలకు రూ.35,000 చెల్లిస్తారు.

- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 6 నుంచి 8 మధ్య
- **టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు:** ఫిజికల్ సైన్సెస్‌కు జూన్ 6, 7; మేథమెటికల్ సైన్సెస్‌కు జూన్ 12 నుంచి 14 వరకు; బయలాజికల్ సైన్సెస్‌కు జూన్ 13, 14; కెమికల్ సైన్సెస్‌కు జూన్ 20 నుంచి 22 వరకు;
- **వెబ్‌సైట్:** www.niser.ac.in

ఐఐఎస్సీ

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. నాలుగో సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. చివరి ఏడాది రీసెర్చ్ ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. మరో సంవత్సరం చదివి మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్) డిగ్రీని పొందే సౌకర్యం ఉంది. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఇన్‌స్పయిర్/ఐఐఎస్సీ ప్రమోషనల్ స్కీం స్కాలర్‌షిప్‌లు ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సును 2023లో పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అర్హులే. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు పాసైతే చాలు. అభ్యర్థులు జేఈఈ మెయిన్ 2024/జేఈఈ అడ్వాన్స్ 2024/నీట్ యూజీ 2024/ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ స్కోర్ ద్వారానే అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 19
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** https://bs-ug.iisc.ac.in

SCHOLARSHIP ALERT

Goonj Setu Fellowship 2024-25

Description: Goonj Setu Fellowship 2024-25 is an opportunity offered by Goonj, a non-profit organisation to graduates aged between 21 to 30 years by 31st July 2024. This programme provides an opportunity to individuals to develop an understanding about themselves and the larger social ecosystem, the dynamics, innovations, and how small things can bring about significant changes.

Eligibility: Open to applicants between 21 and 30 years as on July 31, 2024, having graduated from a recognised institution by the same date. A basic understanding of English or Hindi and proficiency in Microsoft Office and other relevant computer tools are required.

Prizes & Rewards: A fixed monthly fellowship stipend ranging between 20,000 and 22,000 depending on the city.

Last Date to Apply: 22-04-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/GGSF1

Vardhman Foundation Shakun Oswal

Description: An initiative of Vardhman Textiles Limited that aims to support the educational needs of diploma/ITI students.

Eligibility: Students studying in any year of diploma/ITI courses after Class 10 and/or 12 are eligible.

- Applicants must have secured at least 50% marks in their Class 10 and/or 12 examination.
- The annual family income of the applicants must be less than or equal to 6,00,000 from all sources.

Prizes & Rewards: 20,000

Last Date to Apply: 20-04-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SOSP1

The Cadence Scholarship Program

Description: Cadence Design Systems Private Limited & Concern India Foundation invites applications from students pursuing undergraduate or postgraduate courses in the Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad regions to continue their education.

Eligibility: Open to applicants residing and studying in Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad (Indian nationals only) pursuing undergraduate and post-graduate courses.


Prizes & Rewards: Financial support for key educational expenses

Last Date to Apply: 30-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCSP4

ఐడీఆర్‌బీటీలో పీజీ డిప్లొమా



హైదరాబాద్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిర్వహిస్తున్న 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(ఐడీఆర్‌బీటీ)'- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (పీజీడీబీటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైమ్ రెగ్యులర్ ప్రోగ్రామ్. మొత్తం 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ లేదా ఏదేని స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యరులు గేట్/క్యాట్/జీమ్యాట్/జీఆర్ఈ/సీమ్యాట్/ ఎక్స్‌ఏటీ/మ్యాట్/ఏటీఎంఏ అర్హత పొంది ఉండాలి. బ్యాంక్‌లు, ఫైనాన్షియల్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** www.idrbt.ac.in/pgdbt

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/D0Qpw5jలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి


పుట్టిన రోజున టీజర్



ప్రపంచ వ్యాప్తంగా సినిమా ప్రేక్షకులు ఎదురు చూస్తున్న చిత్రం 'పుష్ప 2' ..ది రూల్. అల్లు అర్జున్ , దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ను ఏప్రిల్ 8న విడుదల చేయనున్నారు. ఆ రోజే అల్లు అర్జున్ పుట్టినరోజు కావడంతో డబుల్ ధమాకా అంటూ అభిమానులు ఆనందంతో పొంగిపోతున్నారు. 2021లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'పుష్ప ది రైజ్' చిత్రం జాతీయస్థాయిలో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా అవార్డ్ తెచ్చి పెట్టింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న 'పుష్ప ది రూల్' చిత్రానికి ఆకాశమంత స్థాయిలో అంచనాలు ఉన్నాయి. వాటిని అధిగమించేందుకు సుకుమార్ ఆయన టీమ్ విశేషంగా కృషి చేస్తున్నారు. రష్మిక హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి చిత్ర నిర్మాతలు.

ఎన్‌టీఆర్ గ్యారేజీలో మరో ఖరీదైన కారు..!





జూనియర్ ఎన్‌టీఆర్ గ్యారేజీలో మరో ఖరీదైన కారు చేరింది. ఖైరతాబాద్‌లోని ఆర్‌టీఏ కార్యాలయంలో నూతన వాహనం రిజిస్ట్రేషన్ ఇటీవల జరిగింది. మెర్సిడెజ్ బెంజ్ మే బ్యాక్ మోడల్ కారును ఆయన ఇటీవల కొనుగోలు చేశారు. ఈ కారు ధర రూ.3.50 కోట్ల వరకు ఉంటుంది. కార్లు, వాచీలంటే అమితంగా ఇష్టపడే ఎన్‌టీఆర్ వాటి కొనుగోలుపై ఆసక్తి చూపుతుంటాడు. దేవర, వార్-2 చిత్రీకరణలో ఉన్న ఆయన షూటింగ్‌కు బ్రేక్ ఉండడంతో కారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. ఆర్‌టీఏ అధికారులు దగ్గరుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.

'నా పేరు చిరంజీవి' అని తొలిసారి చెప్పింది సావిత్రమ్మకే



"సావిత్రి గారిపై నాకు ఉన్న అభిమానాన్ని ఇలా పుస్తకావిష్కరణ ద్వారా చూపించే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. 'ప్రేమ తరంగాలు' చిత్రంలో ఆమెకు కొడుగ్గా నటించాను. ఇప్పటికీ ఆమె సినిమాలు, పాటలు ఇంట్లో చూస్తుంటాను. ఈ ప్రపంచంలో కళ్లతో అభినయాన్ని పలికించే ఏకైక నటి సావిత్రమ్మ. ఇది ఆ మహాతల్లి నాకు ఇచ్చిన గొప్ప అవకాశంగా ఈ పుస్తకావిష్కరణను భావిస్తున్నాను" అని చిరంజీవి అన్నారు. సంజయ్ కిశోర్ రచించిన మహానటి 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకావిష్కరణ మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. సావిత్రి నటించిన 47 సినిమాల్లోంచి ఆమె పాత్రలను ఎంచుకొని వాటిని విశ్లేషించి, ఫొటోలతో సహా చక్కని పుస్తకంగా మలిచారు.

చిరంజీవి, సురేఖ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. సావిత్రి కూతురు విజయ చాముండేశ్వరి, అల్లుడు గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "పునాదిరాళ్లు' సినిమాలో మహానటి సావిత్రితో కలసి నటించబోతున్నావు' అని చెప్పినప్పుడు ఒళ్లు జలదరించింది. నమ్మలేకపోయాను. అప్పుడే రాజమండ్రి పంచవటి హోటల్లో తొలిసారి సావిత్రిగారిని చూశాను. ఆమె 'బాబూ నీ పేరేంటి?' అని అడిగారు. అంతకు ముందే స్క్రీన్ నేమ్ చిరంజీవి అనుకున్నాను. అలా తొలిసారి నన్ను చిరంజీవిగా సావిత్రి గారికి పరిచయం చేసుకున్నాను. ఆమె 'శుభం' అన్నారు. ఆ షూటింగ్ జరిగేటప్పుడు ఓ రోజు సావిత్రి గారి ముందు టేప్‌రికార్డర్‌లో పాట పెట్టి డాన్స్ చేశాను. గచ్చుపైన తేమ ఉండడంతో జారి పడ్డాను. కానీ వెంటనే దాన్ని నాగుపాము నృత్యంలా మార్చడం సావిత్రి గారికి బాగా నచ్చింది. నన్ను దగ్గరకు తీసుకొని 'నీ సమయస్ఫూర్తి నచ్చిందోయ్, భవిష్యత్తులో మంచి యాక్టర్‌వి అవుతావు' అని ఆశీర్వదించారు. దాంతో నాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. ఈ పుస్తకావిష్కరణకు వారధిగా నిలిచే అవకాశం ఇచ్చినందుకు చాముండేశ్వరిగారికి ధన్యవాదాలు' అన్నారు.

విజయ చాముండేశ్వరి మాట్లాడుతూ 'నన్ను తోడబుట్టిన సోదరిలా చూసుకుంటారు చిరంజీవి. 'నేను ఉదయం లేవగానే సావిత్రమ్మ ఫొటో చూస్తాను' అని ఆయన చెప్పారు. తన బెడ్‌రూంలో ఉన్న ఫొటోను తెప్పించి చూపించారు. 'ఈ పుస్తకావిష్కరణను సింపుల్‌గా కానిచ్చేద్దాం' అని అన్నాను. కానీ అమ్మకు పెద్ద కొడుకు ఉండుంటే ఏం చేసేవాడో ఈ రోజు చిరంజీవిగా గారు అంత గొప్పగా నిర్వహించారు. ఆయనకు ఎలా ధన్యవాదాలు చెప్పాలో తెలియడం లేదు. 'అమ్మ జీవితం గురించి చాలా పుస్తకాలు వచ్చాయి. ఆమె నటన గొప్పదనం తెలిపేలా ఈ పుస్తకం ఉంటుంది' అన్నారు. తల్లి సావిత్రితో తన బాల్యస్మృతులను చాముండేశ్వరి గుర్తు చేసుకున్నారు. ' అమ్మతో కార్లో వెళ్లేటప్పుడు, కారు మధ్యలో ఆపి పైకెక్కి చింతకాయలు కోసేవాళ్లం. పొలంలో వేరుశనగ కాయలు దొంగతనంగా కోసేది. 'అడిగితే ఇచ్చేవాళ్లం కదమ్మా' అని కావలివాళ్లు అంటే 'ఆ అందులో రుచి ఉండదోయ్' అనేది. అమ్మకు ఆరోగ్యం బాగోకపోవడంతో అత్తకొడుకు గోవిందరావుకు ఇచ్చి 16 ఏళ్లకే నా పెండ్లి చేసింది. అమ్మ కోమాలోకి పోయినప్పుడు 19 నెలలు హాస్పిటల్‌లో ఉంది. ఆ జ్ఞాపకాలు తలుచుకోవడం ఇష్టం లేదు. 'సావిత్రి గారు అన్నీ పోగొట్టారు, పిల్లలకు చిల్లిగవ్వ కూడా మిగల్చలేదు అనుకుంటారు కానీ అది నిజం కాదు. ఎన్ని దానధర్మాలు చేసినా నాకూ, తమ్ముడికి లోటు లేని సంపదను ఇచ్చిపోయింది. 'మహానటి' చిత్రంలో ప్రతిదీ నా అనుమతి తీసుకున్న తర్వాతే చేశారు కాబట్టి అందులో తప్పుపట్టటానికేం లేదు' అన్నారు. సురేఖ మాట్లాడుతూ 'చిరంజీవి గారికి సావిత్రమ్మ అంటే ఎంతో ప్రేమ. అందుకే అంగీకరిస్తారనే నమ్మకంతో ఆయన్ను అడగకుండానే విజయ చాముండిగారికి మాటిచ్చాను. ఇలా వేదికపైన కూర్చోవడం, మాట్లాడడం ఎప్పుడూ చేయలేదు. చాముండి కోసం చేస్తున్నాను. సావిత్రమ్మ గారి గురించి తెలుసుకోవాలనుకున్నాను. అది ఈ రోజు మీ ద్వారా కుదిరింది' అన్నారు. నా జీవితంలో ఒకే ఒకసారి మా స్నేహితుడి ఇంట్లో సావిత్రిగారిని చూశాను. నటనలో ఆమెకు ఆమే సాటి అని అల్లు అరవింద్ చెప్పారు.

తొలి తెలుగు కామెడీ కిడ్ స్టార్ విశ్వేశ్వరరావు ఇక లేరు



ప్రముఖ హాస్య నటుడు జి.విశ్వేశ్వరరావు (64) కన్నుమూశారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ వచ్చిన ఆయనకు సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్టు ఆయన పెద్ద కుమార్తె భార్గవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆయన అంత్యక్రియలను మంగళవారం పూర్తి చేశారు. ఆయనకు భార్య వరలక్ష్మి, కుమార్తెలు భార్గవి, పూజ ఉన్నారు. తమిళం, తెలుగు భాషల్లో దాదాపు 350కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన స్వస్థలం కాకినాడ. 1967లో చెన్నైకు వచ్చిన ఆయన బాల నటుడుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. మాస్టర్ రాము, బేబి రాణి, మాస్టర్ ప్రభాకర్ వంటి బాల నటులు ఎక్కువ సినిమాల్లో నటిస్తూ పేరు తెచ్చుకుంటున్న తరుణంలో ప్రవేశించిన మాస్టర్ విశ్వేశ్వరరావు కొద్ది కాలంలోనే తన ప్రతిభ చాటుకున్నారు. ఆ రోజుల్లో ఎన్టీఆర్, ఏయన్నార్, కాంతారావు, హరనాథ్, జగ్గయ్య వంటి వారు హీరో పాత్రలు చేస్తుంటే రేలంగి, పద్మనాభం, చలం, రాజబాబు హాస్య పాత్రలు పోషించేవారు. ఈ హాస్య నటుల చిన్నప్పటి వేషాలు విశ్వేశ్వరరావు వేసేవారు. బాల తారలతో తీసిన 'బాల భారతం'లో విశ్వేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. తెలుగు సినిమాల వరకూ తొలి కామెడీ కిడ్ స్టార్ ఈయనే.

\- చెన్నై (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yQ3Z1eK లో చదవండి.

స్వలాభం కోసం అమరావతిని నిర్వీర్యం చేశారు

● 1568వ రోజుకు రైతు ఆందోళనలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, ఏప్రిల్ 2: రాష్ట్రాన్ని అమ్మేసేంత అప్పులు సీఎం జగన్‌రెడ్డి సర్కార్ చేసిందని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1568వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులంటూ చేసిన మోసాన్ని ఎండగట్టారు. అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన జగన్‌రెడ్డి సీఎం కాగానే మాట తప్పారన్నారు. పచ్చి అబద్దాలతో ప్రజలను మభ్య పెట్టాలనుకోవటం అవివేకమన్నారు. మూడు ముక్కలాటను వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

గోదావరి జలాలను కృష్ణానదికి తరలిస్తాం

● ఉమ్మడి ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని తదితరులు

మాచవరం, ఏప్రిల్2: రానున్న రోజుల్లో కేంద్రం, రాష్ట్రాలలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గోదావరి జలాలను కృష్ణానదికి తరలిస్తామని, అదేవిధంగా పట్టిసీమ నీరు కూడా సాగర్ కుడికాలువకు పంపించి పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎంపి శ్రీకృష్ణదేవరాయలు స్పష్టం చేశారు. మంగళవారం మాచవరంలోని మునుసుబు గారి కల్యాణ మండపంలో ఉమ్మడి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి సీనియర్ దేశం పార్టీ నాయకులు యడ్లపల్లి రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు గోదావరి జలాలను ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణానదికి తరలించనున్నారన్నారు. అంతేకాకుండా పట్టిసీమ ద్వారా సాగర్ కుడికాలువలోకి నీరు చేరి పల్నాడు ప్రాంతంలోని అన్ని గ్రామాలకు సాగునీరుతోపాటు తాగునీరు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. 2021 సంవత్సరంలో గోదావరి, పెన్నా నదులను అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిందన్నారు. అంతేకాకుండా గంగిరెడ్డిపాలెం దాకా నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఉమ్మడి జిల్లాలకు రూ.500 కోట్లు మంజూరైతే గురజాల నియోజకవర్గానికి రూ.73 కోట్లు, మాచవరం మండలానికి రూ.15 కోట్లు మంజూరు చేయించామన్నారు. ముస్లింలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్ తీసివేస్తారని వైసీపీ వారు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టే విధంగా ముస్లింలు ప్రచారం నిర్వహించాలన్నారు.

అవమానాలను పట్టుదలగా పెట్టుకోండి: యరపతినేని

గత ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పడిన అవమానాలను పట్టుదలగా తీసుకోవాలని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గంలో చేసిన అరాచకాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఒక్క గురజాల నియోజకవర్గంలో 11మంది దేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను చంపించారని, 8మంది పిల్లలు అక్రమ క్వారీ గుంతలలో పడి చనిపోయారన్నారు. అంతేకాకుండా 60 నుండి 70 మంది వరకు కాళ్లు చేతులు విరగ్గొట్టారని, మహిళలపై అత్యాచారాలు చేశారని, పిన్నెల్లి, తురకపాలెం గ్రామాలలో పోలీసులను అడ్డం పెట్టుకొని గ్రామాలలో లేకుండా తరిమివేశారన్నారు. పల్నాడు జిల్లా కేంద్రంగా, చంద్రన్న బీమా ప్రీమియం చెల్లింపు, ఒక సిలిండర్ ఉచితంగా, 15 వేల మందికి ఉద్యోగ అవకాశాలు, హజ్‌యాత్రకు వెళ్లే వారికి ఆర్థిక సహాయం, వేళాంగిణికి వెళ్లేందుకు ఉచిత బస్సు సర్వీసులు తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గురజాల, మాచవరం మండలాల్లో లిఫ్ట్‌ఇరిగేషన్ ద్వారా నీరు అందిస్తామన్నారు. సమావేశంలో డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, అమీర్‌అలి, బడిగుంచల వెంకటేశ్వర్లు, దున్నా చెన్నయ్య చౌదరి, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, చల్లాపల్లి నరసింహారావు, యామని రామారావు, జనసేన మండల అధ్యక్షులు బొమ్మా శ్రీను, బిజెపి నాయకులు అంబటి నవకుమార్, యేలూరి శశి, పలు గ్రామాల ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నా, శివరామ్‌ల మధ్య సయోధ్య

● చొరవ తీసుకున్న జీవీ
● సత్తెనపల్లి, నరసరావుపేటలో టీడీపీ విజయానికి కృషి చేస్తానన్న కోడెల తనయుడు
● సమావేశంలో పాల్గొన్న పార్టీ సమన్వయకర్తలు సత్యనారాయణరాజు, చిరంజీవులు
● త్వరలో శివరామ్‌కు పార్టీ రాష్ట్ర కమిటీలో అవకాశం


మాజీ మంత్రి కన్నా, కోడెల శివరామ్‌లతో జీవీ, సమన్వయకర్తలు సత్యనారాయణరాజు, చిరంజీవులు, చిట్టిబాబు

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దివంగత నేత డాక్టర్ కోడెల శివప్రసాదరావు తనయుడు శివరామ్ సత్తెనపల్లి టీడీపీ సీటును ఆశించి అది దక్కకపోవటంతో కొంతకాలంగా అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించబడిన మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణతో శివరామ్ దూరంగా ఉంటున్నారు. కోడెల కుటుంబానికి తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలుమార్లు తన మనసులోని కోరికను బహిర్గత పరచటం జరిగింది. అసంతృప్తితో ఉన్నప్పటికీ ఇటీవల జరిగిన లోకేశ్ యువగళం పాదయాత్రలో కూడా శివరామ్ పాల్గొని తన సంఘీభావం తెలియపరిచాడు. అయితే కన్నాకు దూరంగా ఉంటూ వచ్చాడు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు, వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు చొరవ తీసుకొని ఇద్దరిని కలిపే ప్రయత్నాలు చేయగా మంగళవారం సఫలీకృతమయ్యాయి. గుంటూరులోని తన నివాసంలో కన్నాను, శివరామ్‌ను కలిపి ఇద్దరూ కలిసి పనిచేసేందుకు ఒప్పించారు. ఈ సమావేశంలో జీవీతో పాటు పార్టీ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీలు మంతెన సత్యనారాయణరాజు, చిరంజీవులు కూడా అధిష్ఠానం తరపున దూతలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివరామ్ మాట్లాడుతూ టీడీపీ అంటే తమ కుటుంబానికి ప్రాణమని, పార్టీకి ఎట్టి పరిస్థితుల్లో ద్రోహం చేయమని అయితే సీటు దక్కకపోవటంతో కొంత అసంతృప్తికి గురయ్యానని పార్టీ నేతలకు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సత్తెనపల్లి, నరసరావుపేటలో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కాగా త్వరలో శివరామ్‌ను రాష్ట్ర కమిటీలోకి తీసుకొని పార్టీకి ఆయన సేవలను వినియోగించుకుంటామని సమన్వయకర్తలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాలపాటికి త్వరలో పల్నాడు జిల్లా పార్టీ పగ్గాలు

● శ్రీధర్‌తో గుంటూరులో సమావేశమైన జీవీ, ఎమ్మెల్సీ చిరంజీవులు
● సీటు దక్కలేదన్న బాధ ఉన్నా పార్టీ విజయానికి కృషి చేస్తానన్న శ్రీధర్


కొమ్మాలపాటి శ్రీధర్‌తో భేటీ అయిన జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ చిరంజీవులు

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, పార్టీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ చిరంజీవులు మంగళవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. పెదకూరపాడు సీటును ఆశించిన శ్రీధర్ అది దక్కకపోవటంతో కొంత మనస్థాపానికి గురైనప్పటికీ వెంటనే తేరుకొని సీటు దక్కించుకున్న భాష్యం ప్రవీణ్‌కు మద్దతు తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కూడా కొమ్మాలపాటిని పిలిపించుకొని ఓదార్చి శ్రీధర్ సేవలను మరోరూపంలో పార్టీకి వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో జీవీ, చిరంజీవులు శ్రీధర్‌ను కలిసి పార్టీ విజయం కోసం మరింత సమయాన్ని కేటాయించాలని కోరారు. త్వరలో పల్నాడు జిల్లా పార్టీ పగ్గాలు కొమ్మాలపాటికి అప్పగించే ఆలోచన కూడా అధిష్ఠానం చేస్తున్నట్లు వీరిద్దరు శ్రీధర్‌కు సూచనప్రాయంగా తెలిపినట్లు తెలిసింది. ఏ పదవి ఇచ్చినా, ఇవ్వకున్నా అధినేత చంద్రబాబు నిర్ణయాన్ని శిరసావహిస్తానని, త్వరలో పెదకూరపాడుతో పాటు మరికొన్ని నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తానని శ్రీధర్ వారికి హామీ ఇచ్చారు.

రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు ప్రచారాలు

● జీవీ ఆంజనేయులు

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు, అవాస్తవాలతో రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ గుంటూరుజిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీపై అధికార వైసీపీ తప్పుడు ప్రచారానికి తెర తీసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పింఛన్లు పంచవద్దని టీడీపీ ఎక్కడా చెప్పలేదని చెప్పారు. జగన్ రెడ్డి తన రాజకీయ ప్రయోజనాల కోసం వృద్ధులు, వికలాంగులను కూడా ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. మొన్నటివరకు ఎలాగైతే ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇచ్చారో, అలాగే ఇవ్వాలని టీడీపీ డిమాండ్ చేస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది పింఛన్లు ఇవ్వలేరా అని ఆయన నిలదీశారు. రాబోయే ఎన్నికల్లో 167 సీట్లతో విజయం సాధించి టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో కోడెల శివరాం నరసరావుపేట, సత్తెనపల్లి టీడీపీ విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని జీవీ ఈ సందర్భంగా చెప్పారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగన్‌రెడ్డి తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి మోసంచేసి అధికారంలోకి వచ్చాడన్నారు. ఇప్పుడు కూడా అదే అవాస్తవాలు, అక్రమాలు, అబద్దాలతో మళ్ళీ ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నాడన్నారు. ఇందులో భాగమే ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేయకుండా నిలిపివేయడమని ఆయన ఆరోపించారు. శాసనమండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ . రాష్ట్ర ప్రజలు అంత అమాయకులు కారని, జగన్‌రెడ్డి కుట్రలను గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, చిట్టాబత్తిన చిట్టిబాబు, యం. దారునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలకు శాశ్వత పరిష్కారం

● పేదరికం నుంచి బయటకు తెచ్చేందుకు కృషి
● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
● మంగళగిరిలో కొనసాగుతున్న యువనేత భేటీలు


చిల్లపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 2: చేనేతల సమస్యలపై అవగాహన ఉంది. రాబోయే రోజుల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి పేదరికం నుంచి బయటకు తెచ్చేందుకు కృషి చేస్తా.. అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరిలో లోకేశ్ వరుస భేటీలు కొనసాగుతున్నాయి. పట్టణానికి చెందిన పలువురు చేనేత ప్రముఖులను మంగళవారం ఆయన కలుసుకున్నారు. తొలుత మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు చేనేతలకు అందించిన రాయితీలను జగన్ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికులకు చేయూత ఇవ్వాలని కోరారు. లోకేశ్ స్పందిస్తూ జగన్ ఇస్తామన్న నేతన్న నేస్తం పథకంలో సవాలక్ష నిబంధనలు విధించడంతో 90 శాతం మంది నేత కార్మికులు అనర్హులుగా మిగిలిపోతున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ కింద రూ.110 కోట్లు చెల్లించామని, ఆదరణ పథకం ద్వారా ప్రతి చేనేత కుటుంబానికి రూ.30 వేల వృత్తి పరికరాలను అందజేశామని, నూలు, రంగులపై సబ్సిడీ ఇచ్చామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సబ్సిడీలను ఎత్తివేసిందన్నారు. ప్రస్తుతం మంగళగిరిలో చేనేతలకు చేయూతనిచ్చేందుకు వీవర్‌శాలను ఏర్పాటు చేసి అధునాతన డిజైన్లు, మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ భారం లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన సబ్సిడీ, సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతోపాటు కార్మిక కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పిస్తామని, చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. అనంతరం 18వ వార్డుకు చెందిన నీలి నాగమల్లేశ్వరరావు, కుర్నెల్ల శ్రీను, కొల్లి కోటయ్య నివాసాలకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

కలెక్టర్ గారూ.. మేము ఓటు వేయలేము..

● ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఓ కుటుంబం


కాలుష్య నివారణకు పెట్టిన అర్జీలు, ఓటు వేయమని పెట్టిన బ్యానర్‌తో ఓటరు రవి

కొల్లూరు, ఏప్రిల్ 2: తమ సమస్యను ఎన్నిసార్లు విన్నవించుకున్నా పరిష్కారం కాలేదని.. కావున తాము ఓటు వేయలమంటూ ఓ కుటుంబం గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటుచేసింది. కొల్లూరు మండలం ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన సనకా రవి కుటుంబం కొల్లూరు కరకట్ట దిగువన నివాసం ఏర్పాటు చేసుకుని చిన్న దుకాణంతో జీవనం సాగిస్తుంది. రోడ్డు వెంబడే ఉన్న నివాసంలో జీవిస్తున్న తమ కుటుంబం కాలుష్య కోరల్లో చిక్కుకుపోయిందని, చుట్టూ ఇటుక బట్టీలు తద్వారా వచ్చే పొగ, దుమ్ము, దూళితో తమ కుటుంబ సభ్యులు శ్వాసకోశ సమస్యలు తదితర వాటితో పలుమార్లు అనారోగ్యానికి గురయ్యారని వాపోయాడు. ఇటీవల కొల్లూరులో కలెక్టర్ నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో స్వయంగా ఆయనకు అర్జీ అందించానని, రెండు రోజుల అనంతరం తన సమస్యను పరిష్కరించామంటూ పత్రం పంపించడంతో మనస్థాపానికి గురయ్యానన్నారు. దీనివల్ల రాబోయే ఎన్నికల్లో తమ కుటుంబం ఓటు వేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా కాలుష్య సమస్యను అధికారులు పరిష్కరించాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైసీపీకి రాజకీయ సమాధి కట్టాలి : డాక్టర్ పెమ్మసాని

● చేబ్రోలు మండలంలో కూటమి అభ్యర్థుల ప్రచారానికి బ్రహ్మరథం



ప్రజలకు అభివాదం చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఏప్రిల్2: అడుగడుగునా ప్రజా వంచన చేసిన అధికార వైసీపీకి రానున్న ఎన్నికలో ప్రజలు రాజకీయ సమాధి కట్టాలని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం చేబ్రోలు మండలం మంచాల, నారాకోడూరు, గుండవరం, గోడవర్రు గ్రామాల్లో కూటమి అభ్యర్థులు రోడ్ షోలు నిర్వహించారు. గ్రామాలకు విచ్చేసిన కూటమి అభ్యర్థులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీల కంటే తక్కువగా వలంటీర్లకు జగన్ ప్రభుత్వం రూ.5 వేల వేతనాలు ఇస్తున్నారన్నారు. బటన్ నొక్కటానికి ఐఏఎస్ అధికారులు ఉన్నారన్ని జగన్ ఎందుకని ప్రశ్నించారు. మద్యం నిషేదం చేయకపోగా మద్యం రేట్లు పెంచుకుంటూ పోతున్నారన్ని ఆరోపించారు. రాజకీయాల్లో తనకు ఒక అవకాశం ఇవ్వాలన్ని విజ్ఞప్తి చేశారు. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం కావాలన్నారు. అభివృద్ధి జరగాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అన్నారు. వ్యవసాయం, కొడాలి నాని, అంబటి రాంబాబు వంటి వారికి మంత్రి పదవులు ఇచ్చింది చంద్రబాబును, పవన్ కళ్యాణ్‌లను తిట్టించటానికేనన్ని ఎద్దేవా చేశారు. నీరు లేక తెల్ల జొన్న పంటల దిగుబడులు తగ్గాయన్నారు. టీడీపీ హయాంలో రైతులకు ఎన్నో ప్రోత్సాహకాలు అందించిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త వడ్రాణం మార్కెండేయ బాబు, ఉగ్గిరాల సీతారామయ్య, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు షైల వెంకట రామరాజు, చందు శ్రీరాములు, ఇరు పార్టీలకు చెందిన పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సరుకు రవాణాలో రైల్వే సరికొత్త రికార్డు

● గత ఆర్థిక సంవత్సరంలో 3,364 మిలియన్ టన్నులు రవాణా
● డీఆర్ఎం ఎం రామకృష్ణ



గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సరుకు రవాణాలో గుంటూరు రైల్వే డివిజన్ సరికొత్త రికార్డుని నెలకొల్పింది. 2023-24 ఆర్థిక సంవత్సరాన్ని ఘనంగా ముగించింది. సరుకు రవాణాలో రెండు దశాబ్దాల గుంటూరు రైల్వే డివిజన్ చరిత్రని నేడు తిరగరాసింది. గుంటూరు డివిజన్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు అత్యధికంగా 3.364 మిలియన్ టన్నుల (రైల్వే మెటీరియల్ కన్సైన్‌మెంట్ మినహా) సరుకు రవాణా చేసింది. గత సంవత్సరంతో పోల్చితే లోడింగ్‌లో ఎన్నడూ లేనివిధంగా అత్యధికంగా 2.763 శాతం పెరుగుదలని నమోదు చేసింది. గుంటూరు డివిజన్ ఏర్పడినప్పటి నుంచి రూ.395.8కోట్లతో 2023-24 సంవత్సరంలో సరకు రవాణా ఆదాయంలో రెండో అత్యధిక ఆదాయంగా ఉన్నది. 4.1 లక్షల టన్నులతో గుంటూరు డివిజన్ ఏర్పడినప్పటి నుంచి 2024 మార్చిలో ఒకే నెలలో అత్యధికంగా సరుకు రవాణా చేసింది. మార్చి 2024లో ఒకే నెలలో ఆర్జించిన అత్యధిక రాబడి 47.09 కోట్లు సాధించింది. గుంటూరు రైల్వే డివిజన్ అత్యుత్తమ సరుకు రవాణా చేయడం గర్వకారణమని డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. ఈ అత్యుత్తమ విజయానికి ఆపరేటింగ్, కమర్షియల్ టీం చేసిన కృషిని డీఆర్ఎం అభినందించారు.

రెంటచింతలలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రెంటచింతల, ఏప్రిల్ 2: రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతకు పేరుగాంచిన రెంటచింతలలో మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 41 డిగ్రీలు నమోదైనట్లు జంగమహేశ్వరపురం వాతావరణ కేంద్రం పీటీవో భాను ప్రసాద్ చెప్పారు. ఈ వేసవిలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత అని పేర్కొన్నారు.

వలంటీర్ సస్పెన్షన్

భట్టిప్రోలు, ఏప్రిల్ 02: సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలను పోస్టు చేసిన వలంటీర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో మల్లికార్జునరావు తెలియజేశారు. మండలంలోని సూరేపల్లి పంచాయితీ తాతావారిపాలెం గ్రామానికి చెందిన మేకా వెంకట శివరామ ప్రసాద్ తప్పుడు వార్తలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడాన్ని గుర్తించామన్నారు. సదరు వలంటీర్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

ఐదుగురు వలంటీర్లు విధుల నుంచి తొలగింపు

కర్లపాలెం, ఏప్రిల్ 2: మండలంలోని సమ్మెటవారిపాలేనికి చెందిన ఐదుగురు వలంటీర్లను విధులు నుంచి తొలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని ఎంపీడీవో నేతాజి మంగళవారం తెలిపారు. ఐదుగురు కొంతమంది రాజకీయ నాయకులకు అనుకూలంగా కొంతమందికి వ్యతిరేకంగా మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన ఒక వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు

● గుంటూరు తూర్పు మస్తాన్‌వలికే
● పొత్తులో భాగంగా ఇతర పక్షాలకు 6 టికెట్లు...!

గుంటూరు/నరసరావుపేట, ఏప్రిల్ 2: ఉమ్మడి గుంటూరు జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం జాబితాను విడుదల చేశారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఆప్, సీపీఐ, సీపీఎంతో పాటు ఇతర ప్రాంతీయ పార్టీలతో ఇండియా కూటమిగా ఆవిర్భవించిన విషయం తెలిసిందే. పొత్తులో భాగంగా ఇతర పార్టీలకు కొన్ని స్థానాలను కేటాయించే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా ఉమ్మడి జిల్లాలో 11 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలికే కేటాయించారు. ఇక ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం ప్రత్తిపాడు నుంచి మరోసారి కొరివి వినయ్‌కుమార్‌కే ఖరారు చేశారు. తాడికొండకు (ఎస్సీ రిజర్వ్‌డ్) చిలకా విజయ్‌కుమార్‌నే రెండో దఫా బరిలో నిలిపారు. పెదకూరపాడు నియోజకవర్గానికి పమిడి నాగేశ్వరరావు, పొన్నూరు స్థానం నుంచి జక్కా రవీంద్రనాథ్, వేమూరు (ఎస్సీ రిజర్వ్‌డ్) బురగా సుబ్బారావు, చిలకలూరిపేట మద్దుల రాధాకృష్ణ, నరసరావుపేట షేక్ మహబూబ్‌బాషా, వినుకొండ చెన్న శ్రీనివాసరావు, గురజాల తియ్యగూర యలమందారెడ్డి, మాచర్ల యరమల రామచంద్రారెడ్డికి ఖరారు చేస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని మిగతా 6 నియోజకవర్గాలైన మంగళగిరి, గుంటూరు పశ్చిమ, బాపట్ల, రేపల్లె, సత్తెనపల్లి, తెనాలి నియోజకవర్గాలకు మిత్ర పక్షాలకు కేటాయించే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, నరసరావుపేట, బాపట్ల ఎంపీ అభ్యర్థుల జాబితాను బుధ, గురువారాల్లో విడుదల చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు

రూ.1.87 కోట్ల నగదు స్వాధీనం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 2: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మంగళగిరి నియోజకవర్గ పరిధిలో 19.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా, తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.1,24,350, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో పార్టీ టవల్స్, ఐదు వందల పాంప్లేట్స్, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.10.80 లక్షల నగదు సీజ్ చేయడం జరిగింది. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీల్లో ఏప్రిల్ 2వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.1.87 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేయటం జరిగింది.

వాహన తనిఖీల్లో రూ.20.90లక్షలు స్వాధీనం

వేమూరు, ఏప్రియల్ 2: మండలంలోని జంపని గ్రామ శివారులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో మంగళవారం ఒక వ్యక్తి నుంచి రూ.20.90లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వేమూరు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. గుంటూరుకు చెందిన దామర్ల రమేష్‌బాబు ద్విచక్రవాహనంపై తీసుకువెళుతున్న డబ్బును సీజ్ చేశామన్నారు. పూర్తి పరిశీలన జరిపి అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

పొందుగల చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా70వేల నగదు స్వాధీనం

దాచేపల్లి, ఏప్రిల్ 2: దాచేపల్లి మండలం పొందుగల రాష్ట్ర పోలీస్ చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా70వేల నగదును నల్గొండ జిల్లాకు చెందిన ఇస్మాయెల్ అనే వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నారు. కారంపూడి మండలానికి చెందిన మరో వ్యక్తి నుంచి అనుమతి లేని తెలంగాణ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిని విచారణ చేస్తున్నట్లు దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు తెలిపారు.

ఇసుక రీచ్‌ని మూయించండి

● సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన ఎస్సీ వర్గాలు

కొల్లిపర, ఏప్రిల్ 2: ఇసుక రీచ్‌ని మూయించాలని, భూగర్భజలాలు తగ్గుతున్నాయంటూ సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఎదుట మున్నంగికి చెందిన ఎస్సీ వర్గాలు మొరపెట్టుకున్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగి కరకట్ట వద్ద జరిగిన ఇసుక తరలింపు విషయంలో ఎస్సీ వర్గాలు జరుపుకున్న పరస్పర దాడులపై ఆయన ఇసుక రీచ్‌ని పరిశీలించి ఇరువర్గాల బాధిత కుటుంబాలతో విచారణ చేపట్టారు. కరకట్ట వద్ద గొడవలు జరగటానికి అసలు కారణం ఏమిటని, ఇసుక లారీలు ఎందుకు ఆపవలసి వచ్చిందని దాడికి గురైన వేమూరి బాలరాజు, వేమూరి అశోక్, వేమూరి రాజేష్ కుటుంబ సభ్యులను అడిగారు. అతి వేగంగా వస్తున్న లారీని అపటంతో మిగతా లారీలు ఆగాయని దీంతో ఇసుకరీచ్‌లో పనిచేస్తున్న వేమూరి మోషే, వేమూరి చింతయ్య, యలమాటి సంజయ్‌లు మాపై గొడవ పెట్టుకుని ఘర్షణకు దిగి కత్తులతో దాడి చేయటమే కాక ట్రాక్టర్‌తో తొక్కించటానికి ప్రయత్నం చేసినట్లు ఆయన తెలిపారు. ఇసుక రీచ్ వలన భూగర్భ జలాలు తగ్గటమే కాక ఇసుక మాఫియా రెచ్చిపోతుందని రీచ్‌ని మరలా ప్రారంభిస్తే గొడవలు జరిగే అవకాశం ఉందని కాబట్టి ఇసుక రీచ్‌ని మూయించాలని సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ ఇసుక రీచ్ నడుపుతున్నవారితో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రవీంద్రరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


మున్నంగి రీచ్‌లో జరిగిన దాడిపై విచారణ చేస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఇంటింటికి ప్రచారంలో బ్రహ్మారెడ్డి సతీమణి జూలకంటి శోభారాణి

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

● జూలకంటి శోభారాణి

రెంటచింతల, ఏప్రిల్ 2: రాష్ట్రంలో వైసీపీ పాలనతో జనం విసిగిపోయి మార్పును కోరుకుంటున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. రెంటచింతలలో రెండో రోజైన మంగళవారం ఉప్పస్తంభాల ఏరియా,బ్రహ్మయ్య బావిసెంటర్, కొట్ల బజార్, పాతకాపుల గడ్డలో నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ సీఎంగా నాలుగోసారి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయగానే ఉద్యోగులతో పాటు ఇతరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఏ ఉద్యోగిని ఇబ్బంది పెట్టే మనస్తత్వం చంద్రబాబుది కాదని స్పష్టం చేశారు. అబద్ధపు ప్రచారాలు నమ్మొద్దని, కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి గెలుపు ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, కాయితి రవికృష్ణారెడ్డి, పల్లెర్ల లక్ష్మారెడ్డి, బోడపాటి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు రాజ్‌కుమార్, రమేష్ బాబు, ఎనిగండ్ల శ్రీనివాసరావు, బాలయ్య, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డి ప్రచార వాహనం అడ్డగింత



పోలీసులతో చర్చిస్తున్న టీడీపీ నేతలు

రెంటచింతల, ఏప్రిల్ 2: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఎల్ఈడీ ప్రచార వాహనాన్ని మంగళవారం రాత్రి రెంటచింతలలో ఓ వ్యక్తి అడ్డగించాడు. ప్రచార వాహనాన్ని తిప్పడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయా అని ఆగ్రహంతో ప్రశ్నించారు. ఆ వాహనాన్ని అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే ఆ వాహనాన్ని పోలీస్‌స్టేషన్ రోడ్డులోకి మళ్లించి మరలా ప్రచారం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి రంగ ప్రవేశం చేసి టీడీపీ నేతలకు సర్దిచెప్పారు. ముందు జాగ్రత్తగా షాపులను మూసివేయించారు. చట్టబద్ధంగా ప్రచారం చేస్తుంటే వాహనాన్ని నిలపడం ఏంటని టీడీపీ నేతలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

నిధులు లేక డ్రామాలకు తెర లేపారు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

సత్తెనపల్లి, ఏప్రిల్ 2 : పింఛన్‌లు పంపిణీ చేసేందుకు నిధులు లేవని, దీన్ని కప్పి పుచ్చు కోవటానికి ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెర లేపిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ పింఛన్‌లకు సంబంధించిన నిధులను కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, దీంతో పింఛన్ దారులకు పంపిణీ చేయటానికి డబ్బుల్లేక దీన్ని కప్పి పుచ్చుకోవటానికి సీఎం కొత్త డ్రామాలకు తెర లేపారన్నారు. వలంటీర్లను దూరం పెట్టడంతోనే ఆలస్యమవుతుందని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. మార్చి 16 నుంచి 30వ తేదీ మధ్య 15 రోజుల్లో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సీఎం సొంత కాంట్రాక్టర్లకు ఆ నిధులు దోచిపెట్టారని ఆయన విమర్శించారు. డబ్బులు లేకనే పింఛన్‌ల పంపిణీ జరగలేదన్నారు. అవినీతి, అక్రమాలు, దోపిడీ, దౌర్జన్యాలకు కేరాఫ్ వైసీపీ అన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

పురపాలక సంఘం ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు

మాచర్లటౌన్, ఏప్రిల్ 2: పట్టణంలోని మున్సిపల్ రిజర్వాయర్ ప్రహరీగోడ ధ్వంసంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు మంగళవారం ధ్వంసమైన ప్రహరీని పరిశీలించారు. దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో, మండల రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పురపాలక సంఘం ఆస్థులు ధ్వంసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీలను జగన్ మోసం చేశాడు : తోడేటి

ముప్పాళ్ళ, ఏప్రిల్ 1: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి, గత ప్రభుత్వాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను అన్నింటినీ జగన్ రద్దుచేసి ఎస్సీ, ఎస్టీలను తీరని అన్యాయం చేశాడని మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్, ఎస్సీ సెల్ మండల నాయకుడు తోడేటి రవి అన్నారు. ముప్పాళ్ళలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అగ్రవర్ణాలతో కలిపి బటన్ నొక్కుతూ ఎస్సీ, ఎస్టీలకు చట్టబద్ధంగా రావలసిన నిధులను పక్కదారి పట్టించాడని అన్నారు. బడ్జెట్‌లో ఎస్సీలకు కేటాయించిన వేలకోట్లు ఎటుపోయాయో ఎస్సీ, ఎస్టీల మంత్రులు, ప్రజాప్రతినిధులు చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు గమనించి జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

హామీలను నెరవేర్చడంలో పిన్నెల్లి విఫలం

● తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ శివారెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 2: ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విఫలమయ్యారని తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గంగలకుంటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరికపూడిశెలను పూర్తి చేస్తామని హామీనిచ్చి శంకుస్థాపనకే పరిమితమయ్యారన్నారు. బుగ్గవాగు నుంచి మాచర్ల పట్టణానికి మంచినీరు అందిస్తామని చెప్పి అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. దుర్గి మిర్చియార్డు కూడా విస్తరించడంలో ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు.

గ్రామాల్లో వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం

మాచవరం, ఏప్రిల్ 2: మండలంలోని పలు గ్రామాల్లో నరసరావు పేట వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, గురజాల ఎమ్మె ల్యే కాసు మహేష్‌రెడ్డిలు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ముందుగా శ్రీరుక్మిణీపురంలోని పలు వీధుల్లో ప్రచారం నిర్వ హించి వైసీపీకి ఓటు వేయాలని ప్రార్థించారు. అనంతరం కొత్తగణేశునిపాడు గ్రామంలో కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం తురకపాలెం గ్రామంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మాయమైన బంగారాన్ని ఇప్పించాలని ఆందోళన

● చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌ను ముట్టడించిన రైతులు



సీజీజీబీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

క్రోసూరు, ఏప్రిల్ 2: ఎనిమిది నెలల క్రితం బ్యాంకులో మాయమైన బంగారాన్ని వెంటనే ఇప్పించాలని కోరుతూ లబ్ధిదారులైన రైతులు క్రోసూరు మండలం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును మంగళవారం ముట్టడించారు. అధికకారులను బ్యాంక్ లోపలకు వెళ్ళనివ్వకుండా తాళాలు వేశారు. వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని, బంగారం పోయి ఆందోళనలో ఉన్న ఖాతాదారులందరికీ వడ్డీ రాయితీ ఇవ్వాలని, బ్యాంక్ వారు గుర్తించిన లబ్ధిదారులతో పాటు మిగిలిన వారికి కూడా పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో మహిళా లబ్దిదారులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. సీజీజీబీ బ్యాంక్ ప్రతినిధి చంద్రశేఖరరావు లబ్దిదారులతో చర్చలు జరిపారు. ఎవరైతే బంగారం పోయిందని అర్జీ పెట్టుకున్న రైతుల డిమాండ్ల మొత్తాన్ని పరిశీలిస్తామని, విచారణ చేయిస్తామని, రైతులకు ఎటువంటి నష్టం రానివ్వమని హామీ ఇచ్చారు. ఆందోళనా కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల ఆంజనేయులు, దగ్గు నటరాజు, వెంకటేశ్వర్లు, బాధిత రైతు సంఘం నాయకులు మర్రి రామకృష్ణారెడ్డి, ఘన్ సైదా, నాగుల్ షరీఫ్, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, బాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లు తలుపులు వేశారు..!

● ఇప్పుడు తలుపులు తెరిచినా ఎవరూ దగ్గరకు రారు
● టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీలు, యార్డు చైర్మన్లు
● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని

దాచేపల్లి, ఏప్రిల్ 2: నాలుగున్నర సంవత్సరాలు తలుపులు వేసి ఇప్పుడు తలుపులు తెరిచి రమ్మని పిలిస్తే ఎవరూ దగ్గరకు రారు.. ఓటరు మార్పును కోరుతున్నారు... అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మంగళవారం ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు దాచేపల్లి నగర పంచాయతీలో పర్యటించారు. లావు, యరపతినేని సమక్షంలో మాజీ ఎంపీపీలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు, కాపు సంఘ నాయకులు వైసీపీని వీడి టీడీపీ కండువా కప్పుకున్నారు. దాచేపల్లిలోని మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్యల ఇంటివద్ద ఏర్పాటు చేసిన సభలో ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా తలుపులు వేసి ఇప్పుడు తలుపులు తీశాం.. రండి అంటే ఎవరూ దగ్గరకు రారు. ప్రజలు మరీ ముఖ్యంగా ఓటర్లు మార్పు చెందారు. పెద్ద పెద్ద సభలు పెట్టినంత మాత్రాన ఏమీ జరగదు. గత ఐదేళ్లలో కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకున్నాను. మరోసారి గెలిపించండి.. మీ అందరికి ఎప్పుడు అండగా అందుబాటులో ఉంటాను అని అన్నారు.

యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బతికి ఉండాలంటే అందరం కలిసి సైకో ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి. అధికారం వుందికదా అని అహంకారంతో వ్యవహరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులుగా లావు శ్రీకృష్ణదేవరాయలు, నన్ను గెలిపించాలని ఆయన కోరారు.

● దాచేపల్లిలో వైసీపీని వీడి టీడీపీలో చేరికల పరంపర కొనసాగుతూనే వుంది. మంగళవారం 150 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీ కండువా కప్పుకున్నారు. దాచేపల్లిలోని మర్కస్, జామియా, ఆక్సా మసీదుల్లో శ్రీకృష్ణదేవ రాయలు, యరపతినేనిలు ప్రత్యేక నమాజు చేశారు. 5వేల మందికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. దాచేపల్లిలోని విజయభాస్కర కల్యాణ మండపంలో ముస్లింలకు రంజాన్ ముబారక్ శుభాకాంక్షలు తెలియ జేస్తూ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్‌కు ముఖ్యఅతిథిగా లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరయ్యారు.



దాచేపల్లిలో టీడీపీ కండువా కప్పుకున్న మాజీ ఎంపిపి అంబటి శేషగిరిరావు, యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య ఇతర కాపు నేతలు



పిడుగురాళ్ల పట్టణంలో శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరిన ఎస్సీ ఎస్టీ బీసీలు

పిడుగురాళ్ల పట్టణంలో..

పిడుగురాళ్ల, ఏప్రిల్ 2: గురజాల నియోజకవర్గంలో వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి వలసలు పెరిగాయి. మంగళవారం పట్టణంలోని 13, 19 వార్డులకు చెందినఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వీరికి లావు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని శ్రీనివాసరావులు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా పట్టణ పార్టీ కార్యాలయంలో గురజాల మండలంలోని పాతఅంబాపురంనకు చెందిన ఎస్సీ మాల సామాజికవర్గానికి చెందిన 15 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దాచేపల్లి పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వడ్డెర, ఎరుకల సామాజికవర్గానికి చెందిన 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చారు.

ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, వేముల తిరుమలకుమార్, వేముల వినోద్‌రెడ్డి, మాజీ ఎంఈపీ అంబటి నవకుమార్, అక్కినపల్లి బాలయ్య, మందపాటి దుర్గారావు, నర్రా పుల్లయ్య, అమీర్ అలి, మామిడి చంద్రశేఖరరావు, పగడాల భాస్కరరావు, అత్తోట రామనరసింహారావు, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, వడ్లవల్లి సాంబశివరావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

వైసీపీ ఉప ఎంపిపి-2 టీడీపీలో చేరిక

మాచవరం, ఏప్రిల్ 2: మాచవరం మండల వైసీపీ ఉప ఎంపీపీ- 2, కొత్తగణేశునిపాడు ఎంపీటీసీ చల్లగుండ్ల లక్ష్మయ్య టీడీపీలో చేరా రు. మంగళవారం మాచవరంలో నిర్వహించిన ఉమ్మడి పార్టీల ఆత్మీ య సమావేశంలో లక్ష్మయ్యకు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని లు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

అన్ని కులాలను, మతాలను ఆదరించాను

● 6న జరగనున్న చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కన్నా పిలుపు



రాజుపాలెం మండల సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఏప్రిల్ 2: 20 సంవత్సరాలుగా నేను అన్ని కులాలను, మతాలను ఆదరించానే తప్ప కించపరచలేదని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం రాజుపాలెం గ్రామంలో ఉన్న కల్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు అధ్యక్షతన టీడీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసీపీ అంటేనే ఒక చీటర్స్ పార్టీ. వీరు అబద్ధాలు, చీటింగులలో భాగమైన ఓటర్ల లిస్టు మేనేజ్ చేసి, తరువాత కూలాల మధ్య చిచ్చుపెట్టాలని, పవన్‌కల్యాణ్‌ను తీవ్రంగా అవమానానికి గురి చేసి గెలవాలని చూశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, మీ బిడ్డల భవిష్యత్తు బాగుండాలన్నా రేపు జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న కన్నా లక్ష్మీనారాయణను, ఎంపీ అభ్యర్థిగా ఉన్న లావు శ్రీకృష్ణదేవరాయలును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఎవరు వచ్చినా చేర్చుకుంటానని, ఎన్నికల తరువాత ఎవరు వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వనని ఈ సందర్భంగా కన్నా హామీ ఇచ్చారు. కులాలపరంగా నాపై దుష్ప్రచారం చేస్తున్నారని అవేమీ కూడా మీరు నమ్మవద్దని కోరారు. నేను ఏ మతానికి ఏ కులానికి వ్యతిరేకిని కానని స్పష్టం చేశారు.

ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలే

సత్తెనపల్లి, ఏప్రిల్ 2: వైసీపీ ప్రభుత్వ ఐదు సంవత్సరాల అవినీతి, అక్రమాలు, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు జరిగాయని కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దోచుకో దాచుకో అనే విధంగా వైసీపీ పాలన కొనసాగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా వైసీపీ నేతల భూకబ్జాలు, ఇసుక, మట్టి అక్రమ రవాణాలు, మద్యం, గంజాయి మాఫియాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీని ఆదరించాలన్నారు.



సత్తెనపల్లిలో కన్నా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

వైసీపీ నుంచి టీడీపీలో భారీ చేరికలు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 2 : మండలంలోని బృగుబండ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ అంబటి సుజాత, శివయ్య, అంబటి గోవిందరావు, శ్రీనివాసరావు, సుబ్బమ్మ, అంబటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, లీల, రామకృష్ణ, బొజ్జా రాము, గంపల లక్ష్మణ, నరసింహారావు, వెంకటరావు తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెంకి చెందిన 50 కుటుంబాలు మంగళవారం సాయంత్రం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అఖిల భారత వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు బత్తుల ఆంజనేయులు ఆధ్వర్యంలో కన్నా సమక్షంలో ఆయన కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

గుడిపూడిలో కన్నా, లావు ముమ్మర ప్రచారం

సత్తెనపల్లి, ఏప్రిల్ 2: మండలంలోని గుడిపూడి గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, లావు శ్రీకృష్ణదేవరాయలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సైకో పాలనకు చరమ గీతం పాడాలన్నారు. మహిళలు హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఆళ్ళ అమరేశ్వరరావు, ఎలినేడి రామస్వామి, గద్దె అప్పారావు, గజానన, గద్దె ఆంజనేయులు, కొనకంచి పుల్లారావు, గోపాళం తాతారావు, బండారుపల్లి సాంబశివరావు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మట్టి తవ్వకాలు

● పోలీసు దాడుల్లో 2 ట్రాక్టర్ల పట్టివేత

మాచవరం, ఏప్రిల్ 2: రెండు, మూడు రోజులుగా గోవిందాపురం, వేమవరం గ్రామాల్లో రాత్రి సమయాల్లో పులిచింతల ముంపు భూముల్లో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మాచవరం పోలీసులు సోమవారం రాత్రి దాడులు చేయగా వారికి రెండు ఖాళీ ట్రాక్టర్లు దొరికాయని, వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ తెలిపారు. ఖాళీ ట్రాక్టర్లు కావడంతో వదిలేశామని పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. 10మందికి గాయాలు

మాచవరం, ఏప్రిల్ 2: మిర్చి కోతలకు కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి సుమారు 10 మంది మహిళా కూలీలకు గాయాలైన సంఘటన మాచవరం, పిన్నెల్లి గ్రామాల మధ్య మంగళవారం చోటు చేసుకుంది. మాచవరం గ్రామానికి చెందిన కూలీలు మిర్చి కాయలు కోసేందుకు ట్రాక్టర్‌లో పిన్నెల్లి వెళ్తున్నారు. మాచవరం గ్రామం దాటిన తరువాత ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో మాచవరం గ్రామానికి చెందిన ముంద్రు సుబ్బులు, గరికపాటి మాధవిలతో పాటు మరో 8 మందికి గాయాలయ్యాయి. కొంతమందిని చికిత్స నిమిత్తం పిడుగురాళ్లలోని ప్రైవేటు వైద్యశాలలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

నాగేశ్వరరావుకు నివాళి

మాచర్ల రూరల్, ఏప్రిల్ 2: టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘ సభ్యుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు మరణం బాధాకరమని ఆ సంఘ నేతలు అన్నారు. మంగళవారం పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ దుర్వాకుల ప్రసాద్, మాచర్ల హనుమంతురావు, నందికొండ నారాయణ, కొల్లిపాక పిచ్చయ్య, నాగేశ్వరరావు, నరేంద్ర, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గురజాలటౌన్, ఏప్రిల్ 2: మండలంలోని పల్లెగుంతకు చెందిన టీడీపీ నేత షేక్ మస్తాన్‌వలి మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ గ్రామానికి చేరుకొని మస్తాన్‌వలి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

లబ్ధిదారులకు తక్షణం పింఛను పంపిణీ చేయాలి

అమరావతి, ఏప్రిల్ 2: మండల పరిధిలోని గ్రామాల్లో పింఛను లబ్ధిదారులకు ఐదో తేదీ లోపు పెన్షన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గుంజి రాణీకి మండల టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది విష్ణు ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఇంటివద్దనే పింఛన్ అందజేయాలి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 2: నేటి నుంచి జరుగనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఇంటివద్దకే వెళ్లి సచివాలయ ఉద్యోగులు పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయకులు ఎంపీడీవో సుబ్బారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

రాజుపాలెం, ఏప్రిల్ 2: మండల పరిధిలోని పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని, వలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మండల తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల టీడీపీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, నాయకులు, కార్యకర్తలు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ జానీ బాషాకు విన్నతి పత్రం అందజేశారు.

ముప్పాళ్ళ ఏప్రిల్ 1: సామాజిక భద్రత పింఛన్లను సచివాలయం ఉద్యోగులతో పంపిణీ చేయించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఈవోపీఆర్డీ ఎస్ రూపవతికి వినతిపత్రం అందజేశారు.

బెల్లంకొండ, ఏప్రిల్ 2: వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఇంటి వద్దనే పెన్షన్‌లు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ నాయకులు మంగళవారం ఎంపీడీవో వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమాల నుంచి వలంటీర్ వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని వారు తెలిపారు.

కారంపూడి, ఏప్రిల్ 2: ఖజానాలో డబ్బులు లేక, పింఛన్ అందించడం సాధ్యంకాక వైసీపీ ప్రభుత్వం టీడీపీపై బురదజల్లుతోందని టీడీపీ నేతలు అన్నారు. లబ్ధిదారులకు ఇంటింటికి తిరిగి పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల ద్వారా పెన్షన్లను అందించాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు.

గురజాలటౌన్, ఏప్రిల్ 2: పింఛన్లను ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేయాలని టీడీపీ నేతలు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణనాయక్‌కు వినతిపత్రం అందించారు.

రెంటచింతల, ఏప్రిల్ 2 : సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇళ్ల వద్దకు వచ్చి పెన్షన్లను పంపిణీ చేసేలా చూడాలని ఎంపీడీవో శంకర్ రావుకు టీడీపీ స్థానిక నేతలు వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి చేసే నాయకుడు చంద్రబాబు

● టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 2: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే నాయకుడు నారా చంద్రబాబునాయుడు మాత్రమేనని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని బుచ్చయ్యపాలెం, రామాపురం, తమ్మవరం, కాశిపాడు, బలుసుపాడు, పరస గ్రామాల్లో మంగళవారం గ్రామాల్లోని టీడీపీ నేతలతో కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంక్షేమ పాలన అందించేది కూటమి అధికారంతోనేనన్నారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, టీడీపీ జిల్లా నాయకులు మద్దిరాల గంగాధర్, మండల జనసేన అధ్యక్షులు మల్లెల చలపతిరావు, షేక్ ముంతాజ్, మక్కెన సాగర్ తదితరులు ఉన్నారు.

మండలంలోని హుస్సేన్ నగరంలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని భాష్యం ప్రవీణ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం టీడీపీ మండల నాయకులు నెల్లూరి మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రవీణ్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ సూపర్ - 6 పథకాల గురించి ప్రజలకు వివరించారు.

లబ్ధిదారుల ఇళ్ళ వద్దకు వెళ్ళి పింఛన్లు అందించాలి

లబ్ధిదారుల ఇళ్ళ వద్దకే సచివాలయ ఉద్యోగులు వెళ్ళి పింఛన్లు అందించాలని టీడీపీ నియోజక వర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కోరారు. పెదకూరపాడు ఎంపీడీవో మల్లేశ్వరికి మంగళవారం వినతి పత్రం అందించారు.

నేడు ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ ఆత్మీయ సమావేశం

బెల్లంకొండ, ఏప్రిల్ 2: మండలంలో బుధవారం భాష్యం ప్రవీణ్ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు వెంకటాయపాలెంలో, 10:50లకు రామాంజనీయపురంలో, 11:50లకు మన్నెసుల్తాన్‌పాలెంలో, మధ్యాహ్నం ఒంటిగంటకు ఎమ్మాజీగూడెంలో, రెండు గంటలకు పాపాయపాలెంలో, 4గంటలకు నందిరాజుపాలెంలో, 5గంటలకు నాగిరెడ్డిపాలెంలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న బాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య

విజన్ గల నాయకుడు చంద్రబాబునాయుడు

● భాష్యం లావణ్య

బెల్లంకొండ, ఏప్రిల్ 2: విజన్ గల నాయకుడు చంద్రబాబునాయుడు అని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం, ఎమ్మాజీగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నేత పీఎస్‌కే మస్తాన్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం మన్నెసుల్తాన్‌పాలెంలో గల రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు మినీ మ్యానిఫెస్టోను వివరించారు. అనంతరం ఎమ్మాజీగూడెంలో ప్రచారం నిర్వహించారు. గ్రామ మహిళలు కొంత మంది ముంపు గ్రామమైన ఎమ్మాజీగూడెంకు 98 గృహాలకు నష్ట పరిహారం ఇవ్వలేదని, వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషి చేయాలని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల అనంతరం సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట టీడీపీ నేతలు అక్కల వెంకట రామిరెడ్డి, బలరామిరెడ్డి, బత్తుల రామకృష్ణ, హనుమంతరావు, ఇక్కుర్తి పేరయ్య, గుంజా గంగారావు, పిచ్చారెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, మాజీ కన్వీనర్ వర్ల వెంకటేశ్వర్లు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్లటౌన్, ఏప్రిల్ 2: ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అధికారులకు సూచించారు. మాచర్ల మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, టెంట్లు, మరుగుదొడ్లు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. అలాగే విజయపురిసౌత్‌లోని ఇంటిగ్రేటెడ్ బోర్డర్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం చింతలతండా గ్రామంలో రేషన్ బియ్యం సరఫరా వాహనం వద్ద కార్డుదారులకు అందించే ఫోర్టిఫైడ్ బియ్యం, కందిపప్పు, పంచదార సరుకులను పరిశీలించారు. సరుకులు సక్రమంగా అందిస్తున్నారా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు



బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో యాగంటి తదితరులు

మాచర్లటౌన్, ఏప్రిల్ 2: ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం.. బావితరాలకు బంగారు భవిష్యత్‌ను అందిద్దామని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నో సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటన్నింటిని కేవలం చంద్రబాబు మాత్రమే పరిష్కరించగలరని అన్నారు. నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, నియోజకవర్గ అభ్యర్థి బ్రహ్మారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

వలంటీరీ వ్యవస్థను అడ్డుపెట్టుకొని దొంగ నాటకాలు

వైసీపీ ప్రభుత్వం వలంటరీ వ్యవస్థను అడ్డుపెట్టుకొని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ అందించకుండా దొంగ నాటకాలు ఆడుతోందని యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మూడు నెలల క్రితమే హైకోర్టు వలంటరీ వ్యవస్థను ఎన్నికలకు దూరంగా ఉంచాలని తీర్పునిచ్చిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత వలంటరీ వ్యవస్థకు డబ్బులు అందించడం కుదరదని తెలిసి కూడా వైసీపీ ప్రభుత్వం సచివాలయ, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖ ఉద్యోగులున్నప్పటికీ వారిని వినియోగించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

విస్తృతంగా సూపర్ 6 ప్రచారంలో తెలుగు తమ్ముళ్లు

దుర్గి, ఏప్రిల్ 2: మండల పరిధిలోని గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా పేదల అభ్యున్నతే ధ్యేయంగా రూపొందించిన సూపర్ 6 పథకాలను ప్రజల్లో తెలుగుతమ్ముళ్లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దుర్గి, ఓబులేశునిపల్లె, ముటుకూరు, అడిగొప్పుల, ఆత్మకూరు, ధర్మవరం, శ్యామరాజపురం గ్రామాల్లో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి నరసింహారావు, వెలిదండి శ్రీనివాసరావు, కటకం భవన్నారాయణ, గైగోపాల్, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, గొంటి సీతారామయ్య, బొల్లెద్దుల శాంతి, రామలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

పింఛను ఆలస్యానికి జగన్‌రెడ్డే కారణం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 2: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛను అలస్యం కావడానికి కారణం ఖజానాలో డబ్బును జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లకు బదిలీచేసి ఆ నెపాన్ని తెలుగుదేశం పార్టీ మీద, ఎన్నికల కమిషన్ మీద వేయటం మోసానికి నిదర్శనం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ పెన్షన్లు ఏప్రిల్ 1న ఇవ్వాలనుకుంటే 3వ తారీకు ఇస్తారని సచివాలయాల్లో ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. దివ్యాంగులకు రూ.3వేలు ఇస్తామనిచెప్పి ఇవ్వకుండా అంచలవారీగా రూ.250 పెంచుకుంటూ రూ.3వేలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఎన్నికల కమిషన్ చెప్పినట్లు ఒక లక్ష 35వేల మంది ఉన్న సచివాలయ ఉద్యోగులు పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి ఇవ్వాలని, లేనిపక్షంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల తరపున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఉచ్చులో పడకుండా వలంటీర్లు పనిచేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి జనవరి 23న బటన్‌నొక్కిన ఆసరా డబ్బులు, ఫిబ్రవరి 16న బటన్‌నొక్కిన చేయూత డబ్బు, ఫిబ్రవరి 29న బటన్‌నొక్కిన విద్యాదీవెన డబ్బు, మార్చి 14న నొక్కిన ఈబీసీ నేస్తం డబ్బు కూడా జమకాలేదన్నారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీకి ఇవ్వవలసిన రూ.13వేల కోట్లు ఈ రోజుకు ఇవ్వలేదన్నారు. రైతులకు ఇచ్చే రైతు భరోసా జమకాలేదన్నారు. ఏదైతే మార్చి 16 నుంచి 30వ తారీఖు వరకు 15 రోజులలోనే అనుకూలమైన కాంట్రాక్టర్లకు డబ్బుఇచ్చిన మాట వాస్తవం కాదా జగన్‌మోహన్‌రెడ్డి అని నిలదీశారు. కాంట్రాక్టర్లకు మాత్రం డబ్బులు ఇచ్చేసి, ఇతరులకు ఉత్తుత్తి బటన్‌నొక్కిన జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారా? ప్రజలు ఆలోచించుకోవాలన్నారు.



ఆర్యవైశ్యులతో సమావేశమైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

ఆర్యవైశ్యులతో ఎంపీ లావు, డాక్టర్ చదలవాడ సమావేశం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 2: నరసరావుపేట పట్టణంలో కోట సెంటర్‌లోని సింధు అపార్ట్‌మెంట్‌లో నరరావుపేట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమకు ఓటు వేసి గెలిపించాలని ఆర్యవైశ్యులను అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే వ్యాపారులకు సహకరిస్తామని తెలిపారు. నిత్యం అందుబాటులో ఉండి ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, గట్టుపల్లి సత్యనారాయణ, అత్తులూరి సుబ్బారావు, వార్డ్ ప్రెసిడెంట్ వనమా పవన్, పచ్చిపులుసు సతీష్, వనమా శివ, మాజేటి వెంకటేష్, గంధం సూర్యనారాయణ, కోడూరు రాము, కాకుమాను వెంకట్రావ్, ఆర్వపల్లి శ్రీనివాసరావు, కాకుమాను శ్రీనివాసరావు, ఇమ్మడిశెట్టి నరసింహారావు, గుర్రం సుబ్రమణ్యం, నాగవరపు ప్రసాద్, తాళ్ళూరి సత్యానారాయణ, దేసు శ్రీనివాసరావు, కొత్త పెద్దన్న, గుర్రం పవన్, కొత్తూరి గోపి, వనమా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



26వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు

● మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 2, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని శివారు ప్రాంతాల వారికి మెరుగైన తాగునీటి సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి మార్నింగ్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని 26వ వార్డు పెద్ద చెరువు రాజీవ్ గృహకల్ప, 34వ వార్డు బీసీ కాలనీ పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర సమస్యలను వార్డు ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు తాగునీరు తక్కువగా వస్తున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ ప్రాంతాలు చివరిగా ఉండటం వలన తాగునీటి సరఫరా తక్కువగా వస్తున్నాయని వారికి ప్రత్యేక సమయం ఏర్పాటుచేసి తాగునీళ్ల అందేలా చూడాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో కమిషనర్ మాట్లాడుతూ ఎండాకాలం తాగునీరుని పొదుపుగా వాడుకొని పురపాలక సంఘంకు సహకరించాలని కోరారు. అదేవిధంగా కాలువలు కూడా డీసిల్ట్ ప్రక్రియను రెండు మూడు రోజులలో పూర్తిస్థాయిలో చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ కనకారావు, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అత్యంత శక్తి వంతమైనది విద్యుత్ ఇంజనీరింగ్

● జేఎన్‌టీయూ ఫెస్ట్ 2కే24లో ముఖ్యఅతిథి టిప్పుసింగ్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 2: సమాజంలో అత్యంత శక్తివంతమైనది విద్యుత్ ఇంజనీరింగ్ అని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ టిప్పుసింగ్ అన్నారు, మంగళవారం జేఎన్‌టీయూ నరసరావుపేట క్యాంపస్‌లో 5వ ఎలక్ట్రికల్ విద్యుత్ టెక్నికల్ ఫెస్ట్ 2కే24 నిర్వహించారు. ఈ సాంకేతిక సమ్మేళనాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన టిప్పుసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి టిప్పుసింగ్ మాట్లాడుతూ ఇన్నోవేషన్, క్యాపిటల్ ఎకానమీ, నెట్‌వర్కింగ్‌లో ఏ విద్యార్థి అయితే మంచి ప్రావీణ్యం సాధిస్తారో అతనికి ప్రస్తుత సమాజంలో తగిన గుర్తింపు వస్తుందన్నారు. ఉద్యోగాలలో టెక్నాలజీ ఇంజనీరింగ్ అప్లికేషన్ల ఉత్పత్తిలో 80శాతం బీటెక్ కోర్సులలో ఉపయోగించడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ టెక్నికల్ ఫెస్టివల్ ఆధునిక సాంకేతికత గురించి వివరిస్తాయన్నారు. ముఖ్యఅతిథి టిప్పుసింగ్, వైస్ ప్రిన్సిపాల్ వైఎస్ కిషోర్‌బాబు, కన్వీనర్ డాక్టర్ కే విమలకుమార్, ఫెస్ట్ స్టూడెంట్ సమన్వయకర్తలుగా బీ సాయికుమార్, ఎన్ రిస్సీ, డి నారాయణ, పీ లావణ్య విద్యుత్ ప్రతికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెక్‌ఫెస్ట్ సమన్వయకర్త డాక్టర్ కే విమల కుమార్ మాట్లాడుతూ ఈవెంట్స్‌కి వివిధ కళాశాలల నుంచి 110 మంది రిజిస్ట్రేషన్ చేసుకొని ఈ సాంకేతిక సమ్మేళనంలో పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 2: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నరసరావుపేట రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని పేరేచర్ల - నల్లపాడుల మధ్య చోటు చేసుకున్నట్టు నరసరావుపేట రైల్వే ఎస్ఐ పీ సుబ్బారావు మంగళవారం తెలిపారు. మృతునికి సుమారు 25సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. సుమారు ఐదు అడుగుల ఎత్తు ఉన్నాడని, నేవీ బ్లూ ట్రాక్ ఫ్యాయింట్, బ్లూ కలర్ టీ షర్టు ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులకు పీహెచ్‌డీలు



డాక్టరేట్ అందుకున్న కృష్ణారెడ్డిని అభినందిస్తున్న సెక్రటరీ అట్లూరి శాంతి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 2: స్థానిక పెట్లూరివారిపాలెంలో ఉన్న ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కే కృష్ణారెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కే శ్రీకర్ చంద్ పీహెచ్‌డీ సాధించారని కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని సత్యసాయి యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్ నుంచి పీహెచ్‌డీ పొందారన్నారు. ఆప్టిమైజేషన్ ఆఫ్ హైబ్రీడ్ విండ్ అండ్ ఫోటోవాల్‌టిక్ బేస్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అనే అంశం మీద పరిశోధనకు కే కృష్ణారెడ్డి, ఇన్‌ఫ్లూయన్స్ ఆఫ్ ఫ్లై యాష్ అండ్ డెన్సిఫైడ్ సిలికా ఫూమ్ అండ్ ఆడిటివ్ ఆన్ మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ కోయిర్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ హైస్ట్రెంత్ కాన్‌క్రీట్ అనే అంశం మీద పరిశోధనకు కే శ్రీకర్ చంద్‌లు డాక్టరేట్ సాధించారన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

● పంపిణీపై పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి ● కలెక్టర్ శివ శంకర్ లోతేటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్ లోతేటి

నరసరావుపేట, ఏప్రిల్ 2: జిల్లాలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లుచేసినట్టు కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి శనివారం వరకు పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు. వికలాంగులు, వృద్ధులకు ఇంటివద్దే పంపిణీ జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు ఆయన మునిసిపల్ కమిషనర్‌లు, మండల అధికారులతో సమీక్షించారు. ప్రతి క్లస్టర్‌కు ఒక ప్రత్యేక అధికారి నియమించి పర్యవేక్షించేలా చూడాలన్నారు. సంబంధిత సచివాలయాల వద్ద నిబంధన తెలిపేలా నోటీసు బోర్డులలో వివరాలు ఉంచాలన్నారు. సచివాలయం వద్ద ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీటి వసతి, టెంట్లను ఏర్పాటుచేయాలని, కూర్చునేవిధంగా కుర్చీలను కూడా ఉంచాలని ఆయన సూచించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు ఎండ తీవ్రత లేని వేళల్లో పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వీలైనంతవరకు సచివాలయానికి రాగలిగిన వారికి సచివాలయం వద్దనే పింఛన్లు అందచేయాలన్నారు. పింఛన్లు పంపిణీ ప్రక్రియలో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు ఎవరు ఉండకూడదని ఆయన తెలిపారు. పింఛన్ల పంపిణీలో జిల్లాని ముందు వరుసలో ఉంచాలన్నారు. పింఛన్ పంపిణీలో ఆధార్‌తో మాత్రమే పింఛన్ పంపిణీ చేయాలని, పింఛన్ల సంబంధించిన కార్డులు ఉండకూడదు అన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పింఛను పంపిణీ చేయాలన్నారు. పింఛన్లు పంపిణీ చేసే వారి వద్ద అథారిటీ లెటర్లు విధిగా ఉంచుకోవాలని తెలిపారు.

10న ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు 10న నిర్వహించడం జరుగుతుందని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు తెలిపారు. మండలాధికారులు ఎండాకాలం తీవ్రతపై అవగాహన కల్పించాలని తదనుగుణంగా సంబంధిత సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎఫ్ఎస్‌టీ టీములు తరచూ పర్యటిస్తూ ఉండాలని తెలిపారు. 85 సంవత్సరాలు పైబడిన వారికి దివ్యాంగులకు హోం ఓటింగ్ కల్పించే విధంగా 12డీ ఫారాలను బీఎల్వోలతో అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మరి ఇతరులు ఎవరూ పాల్గొనకూడదని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖజానా ఖాళీచేసి.. విపక్షాలపై నిందలా..!!

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



టీడీపీ పథకాలపై ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 2: జగన్ తన అడ్డగోలు, అవినీతి అసమర్థ విధానాలతో ఖజానా ఖాళీ చేసిందే కాక ఇప్పుడు పింఛన్ల నగదు కూడా దారి మళ్ళించి ఆ నిందలను విపక్షాలపై వేయాలని చూడటం దారుణమని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలోపెట్టి అభివృద్ధి పథంలో నడిపించగల ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రానికి కనీసం రాజధాని కూడా లేకుండా చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పలు కుటుంబాలు పలకలూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ పేదల పింఛన్లు ఆగటానికి కారణమైంది కాక వైసీపీ అడ్డగోలు గ్లోబల్ ప్రచారానికి తెరలేపారని విమర్శించారు. సొంత కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు పేరుతో ఖజానాను ఊడ్చేసిన జగన్ ప్రభుత్వపింఛన్లు పంపిణీ చేయలేక చేతులుఎత్తివేసిందన్నారు. ఈ నిజాన్నిదాచి టీడీపీ అడ్డుపడుతోందని ప్రచారం చేస్తున్నారని ప్రత్తిపాటి మండిపడ్డారు. సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పేదల రక్తాన్ని పీలుస్తున్న జగన్

యడ్లపాడు, ఏప్రిల్ 2: అధిక ధరలు, కల్తీ మద్యంతో జగన్ పేదల రక్తాన్ని పీలుస్తున్నారని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ఉప్పరపాలెం, వంకాయలపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల గురించి తెలయచేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీ కాలనీలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ గత ఐదేళ్లలో పేదలపై ఎన్నో రెట్లు ధరల భారం వైసీపీ ప్రభుత్వం మోపిందన్నారు. పాస్టర్ సుభాష్‌చంద్రబోస్ కాలనీ వాసులకు ఉద్యోగాలు కల్పిస్తామని, అలాగే గ్రామంలో సిమెంటు రోడ్లు, అసంపూర్తిగా ఉన్న చర్చి నిర్మాణానికి సహకరిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, బీజేపీ నాయకులు టి జయరామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, నాయకులు తేళ్ళ సుబ్బారావు, పుల్లారావు, స్టీఫెన్ కరుణాకర్, కె.రఘురామారావు, కుర్రా రత్తయ్య, వీరారెడ్డి, ఎం సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, తెలుగు యువత నాయకులు ఆజారుద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకెంత కాలం ప్రజలను మోసం చేస్తావ్ జగన్

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 2: అబద్ధాలు, అడ్డగోలు ప్రచారాలే ఊపిరిగా నడుస్తున్న వైసీపీతో ఇంకెంత కాలం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తావ్ జగన్‌రెడ్డి అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని సుభానీ నగర్, 6వ వార్డులోని గాయత్రి అపార్ట్‌మెంట్, 7వ వార్డులోని తులసీ అపార్ట్‌మెంట్ వాసులతో ప్రత్తిపాటి ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చంద్రబాబును సీఎంను చేయాలి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 2: బీసీలంటే ప్రాణమిచ్చే చంద్రబాబును మళ్ళీ ముఖ్యమంత్రిని చేయాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చంద్రబాబు వస్తేనే బీసీలకు పూర్వ వైభవం వస్తుందన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 8వ క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ సమద్ ఖాన్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని బీసీ నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి బీసీ డిక్లరేషన్ కరపత్రాలు ఆవిష్కరించారు.

జగన్ పాలనలో పేదలే నష్టపోయారు

నాదెండ్ల, ఏప్రిల్ 2: జగన్ పరిపాలనలో ఎక్కువగా పేదలు, బడుగు, బలహీన వర్గాలే నష్టపోయారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని చందవరంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో సూపర్-6 పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీచేసిన అనంతరం జరిగిన సభలో పుల్లారావు మాట్లాడుతూ పేదల పేరు చెప్పి ఈ ఐదు సంవత్సరాల్లో జగన్‌రెడ్డి లక్ష కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతోనే సాధ్యమన్నారు.

బీసీలను రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలి: టీడీపీ

వినుకొండటౌన్, ఏప్రిల్ 2: వినుకొండ నియోజకవర్గంలో బీసీలను రెచ్చగొట్టేలా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వైసీపీలోని కొందరు బీసీ నాయులతో మాట్లాడించడంపై వినుకొండ తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూజండ్ల మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణయాదవ్ మాట్లాడుతూ బీసీలకు వైసీపీ తప్ప మరేపార్టీ ఏంచేయలేదన్నట్లుగా మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి మాట్లాడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో బీసీలు అంటే తెలుగుదేశం అని, తెలుగు దేశం అంటే బీసీల పార్టీగా ఉందన్నారు. టీడీపీలోనే బీసీలకు అత్యధికంగా రాజకీయ గుర్తింపు వచ్చిందని, రాజ్యాధికారంలో బీసీలు భాగమయ్యారని అన్నారు. బీసీలకు రాజ్యాంగం కల్పించిన 25శాతం కంటే, చంద్రబాబు నాయుడు మరో 10శాతం కలిపి రిజర్వేషన్ అమలుచేశారన్నారు. గత ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన పథకాలు రద్దుచేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కిందన్నారు కార్యక్రమంలో నియోజకవర్గం బీసీ సెల్ నాయకులు గోవింరాజులు, బత్తుల సుబ్బారావు, గౌనబోయిన శివయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



వయ్యకల్లులో ఆరుపథకాలను వివరిస్తున్న హరీష్‌బాబు

రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును గెలిపించాలి

● మాజీ ఎమ్మెల్యే జీవీ తనయుడు హరీష్‌బాబు

వయ్యకల్లు (శావల్యాపురం) ఏప్రిల్ 2: వైసీపీ అరాచక పాలనతో వెనుకబడ్డ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీర్చిదిద్దాలంటే చంద్రబాబును సీఎంగా గెలిపించాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తనయుడు గోనుగుంట్ల హరీష్‌బాబు అన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వయ్యకల్లులో హరీష్‌బాబు ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మ్యానిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించిన ఆరుపథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, మండల ఉపాధ్యక్షుడు గోనుగుంట్ల వెంకట్రావు, గ్రామపార్టీ అధ్యక్షుడు నడింపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, ఆలూరి యుగంధర్, స్వాములు, గంటా ఏడుకొండలు, పిచ్చయ్య, రామయ్య సీనియర్ నాయకులు యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శంఖారావం ప్రారంభం

వినుకొండ, ఏప్రిల్ 2: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ బలపరిచిన పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులను గెలిపించాలని గోనుగుంట్ల లీలావతి మంగళవారం కొత్తపేటలో ఇంటింటికి శఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ ప్రవేశ పెట్టిన పథకాలను గురించి వివరించారు.

సూపర్ - 6 పథకాలు టీడీపీని గెలిపిస్తాయి

రొంపిచర్ల, ఏప్రిల్ 2 : సూపర్ - 6 పథకాలు తెలుగుదేశం పార్టీని గెలిపిస్తాయని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు మంగళవారం పేర్కొన్నారు. మండల కేంద్ర మైన రొంపిచర్లలో సూపర్ - 6 పథకాల పై అవగాహన కల్పించారు. నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన పథకాలు అన్నివర్గాల ప్రజలకు మేలు కలిగిస్తాయన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

రాజకీయ లబ్ధికోసం కులాల మధ్య చిచ్చు తగదు

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు

శావల్యాపురం, ఏప్రిల్ 2: ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను టీడీపీ నేతలు దూషించారంటూ బీసీలను రెచ్చగొట్టి కులాలమధ్య చిచ్చురేపి రానున్న ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రయత్నిస్తున్నారని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. శావల్యాపురంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ నేతలు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, వైసీపీ పాలనలో ఎందరో బీసీలపై దాడులు జరిగితే పెదవి విప్పని బీసీ నాయకులకు ఇప్పుడు కులం గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. బీసీలకు 24శాతం రిజర్వేషన్‌లిచ్చి చట్టసభలలో కూర్చోబెట్టిన మహనీయుడు ఎన్టీఆర్ ఐతే బీసీ రిజర్వేషన్‌ను 24శాతం నుంచి 33శాతానికి పెంచి వారికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది చంద్రబాబు అన్నారు. టీడీపీ రాష్ట్రఅధ్యక్షుడిగా అచ్చెన్నాయుడును నియమించి బీసీలపై చంద్రబాబు మక్కువ చాటితే అదే అచ్చెన్నాయుడును అక్రమంగా జైలులో పెట్టి చిత్రహింసలకు గురి చేసింది సీఎం జగన్ కాదా అని ప్రశ్నించారు. మండల బీసీ నాయకులు దొడ్డా ఏడుకొండలు మాట్లాడుతూ అనిల్‌కుమార్‌యాదవ్‌కు మంత్రి పదవి ఇచ్చారేగాని అధికారాలివ్వకపోవడంతో పోలవరాన్ని ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకెళ్ళలేకపోయాడని, ఆయన నోటిదురుసుతో చివరకు నోటి పారుదలశాఖ మంత్రిగా మిగిలిపోయాడన్నారు. బీసీలకు 56 కార్పోరేషన్‌లు పెట్టి నిధులివ్వకుండా సీఎం బీసీలను మోసం చేశారన్నారు. టీడీపీ బీసీసెల్ మండలాధ్యక్షుడు ఎర్రగొర్ల ఆదినారాయణ, బి.శ్రీనివాసరావు, వెంకటకృష్ణయ్య, కాటం వెంకటేశ్వర్లు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారుల్లో అలజడికి వైసీపీ యత్నాలు

శావల్యాపురం, ఏప్రిల్ 2: వలంటీర్లు లేకపోతే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ జరగదని అసత్య ప్రచారాలు చేస్తూ పింఛన్‌దారులలో అలజడులు సృష్టించి రానున్న ఎన్నికలలో రాజకీయంగా లబ్ధి పొందేందుకే వైసీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు అన్నారు. వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని వైసీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు చేసిన వ్యాఖ్యలను ఆయన మంగళవారం ఖండించారు. సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికలకోడ్ అమల్లో ఉండగా వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించవద్దని ఈసీ ఆదేశాలు జారీచేస్తే పింఛన్ల పంపిణీని టీడీపీ అడ్డుకొంటున్నారని అసత్య ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఓవైపు అధికారులను కోరుతుంటే వైసీపీ నాయకులు మాత్రం దాన్ని కూడా రాజకీయం చేసేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఆయనతో టీడీపీ నాయకులు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గద్దె వీరమస్తాన్‌రావు, దొడ్డా ఏడుకొండలు, ఒత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలి

బొల్లాపల్లి, ఈపూరు, నూజెండ్ల ఏప్రిల్ 2: వృద్ధులు, వికలాంగులకు, ఇతర పింఛనుదారులకు ఇంటివద్దే పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని, వలంటీర్లు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. బొల్లాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు జరపాల గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, పార్టీ నేతలు హనుమానాయక్, అర్వలపూడి శ్రీనివాసరావు తదితరులు, ఈపూరు ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండుకు మండలపార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, జి.వెంకయ్య, బెల్లంకొండ సైదులు, చాపల మల్లయ్యనర్రా కిశోర్, మద్దం శ్రీను, నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ భావనకు మండల పార్టీ అధ్యక్షుడు ఎం మురళీకృష్ణయాదవ్, టీడీపీ నాయకులు ముంద్రు సుబ్బారావు, జి.ఆంజనేయులు, బచ్చు అంజిరెడ్డి, బి.సుబ్బారావు, ఎరయ్య, వెంకటరావు, శివయ్య తదితరులు వినతిపత్రాలు అందించారు.

ఎమ్మెల్యే బొల్లాకు ఎన్నికల అధికారి నోటీసు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 2: రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు నియోజకవర్గం ఎన్నికల అధికారి (ఆర్వో) సుబ్బారావు మంగళవారం నోటీసులు జారీచేశారు. నోటీసుపై వివరాలు తెలిపేందుకు బ్రహ్మనాయుడు నిరాకరించారు. మార్చి 31వ తేదీన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజినేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులను దుర్భాషలాడిన వైనంపై జీవీ ఆంజనేయులు, పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల అధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు నోటీసులు అందచేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ అంశం పట్టణంలో సంచలనంగా మారింది.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరి మృతి

వినుకొండ టౌన్, ఏప్రిల్ 2: అందుగుల కొత్తపాలెంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నరసరావుపేటకు చెందిన శివదుర్గరావు ప్రకాశం జిల్లా కుంట నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అదే సమయంలో మార్కాపురం మండలం కొండపల్లికి చెందిన తిరుపాల్ ద్విచక్ర వాహనంపై వినుకొండ నుంచి స్వగ్రామం వెళ్తున్నాడు. కొత్తపాలెం వద్ద రెండు వాహనాలు ఎదురెదురు ఢీకొని శివదుర్గారావు అక్కడికక్కడే మృతిచెందగా తిరుపాల్ తీవ్రగాయాలతో నరసరావుపేట వైద్యశాలలో సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ స్వర్ణలత తెలిపారు.

ఆటో బోల్తా... ముగ్గురికి గాయాలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 2: చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో లింగంగుంట్ల వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామానికి చెందిన కోలాటం బృందం మార్టూరు మండలం వలపర్ల గ్రామంలో ఆంజనేయస్వామి తిరునాళ్ళ సందర్భంగా కోలాటం నిర్వహించి ఆటోలో తిరుగు ప్రయాణం అయ్యారు. మొత్తం 12మంది ఆటోలో ఉన్నారు. ఆటో ముందుటైరు పంచరై అదుపు తప్పి బోల్తాపడింది. వీరిలో గాయపడ్డ ముగ్గురిని చిలకలూరిపేట 108 వాహనంలో ప్రథమ చికిత్సచేసి వారి బంధువుల సూచన మేరకు నరసరావుపేటలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు తరలించారు.

64 మద్యం సీసాల స్వాధీనం

చిలకలూరిపేట, ఏప్రిల్ 2: తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని చిలకలూరిపేట సెబ్ అధికారులు అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. సెబ్ స్టేషన్ ఎస్ఐ శశికుమార్ మంగళవారం తెలిపిన వివరాల మేరకు చిలకలూరిపేట మండలం గోవిందపురంనకు చెందిన కే.రాజేష్ తెలంగాణ మద్యం అమ్ముతుండటంతో అతడిని అదుపులోకి తీసుకొని 12ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతడు ఇచ్చిన సమాచారం మేరకు నరసరావుపేటకు చెందిన కే దిలీప్‌కుమార్ వద్ద మరో 52 ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 64 సీసాలు వారు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.70వేలు అని తెలిపారు. నిందితులు ఇద్దరిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. దాడుల్లో కానిస్టేబుళ్ళు చైతన్య, రవిబాబు, నాగరాజు, నాగేశ్వరరావు, ఎన్.దిలీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సుధాకర్ బాబుకు మాతృ వియోగం

నాదెండ్ల, ఏప్రిల్ 2: ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి తలతోటి అన్నమ్మ (81) మంగళవారం మృతి చెందారు. ఆమె పలు పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. ఆమెకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. తూబాడులో ఆమె భౌతికకాయాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైసీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పీ అనీల్‌కుమార్‌యాదవ్, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి కే మనోహర్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ బొల్లెద్దు చిన్న, టీడీపీ నాయకులు మల్లెల రాజేష్ నాయుడు, పీ వెంగళరాయుడు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. సుధాకర్‌బాబుకు, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

మూడు గ్రామాల్లో పోలీసు కవాతు

నాదెండ్ల, ఏప్రిల్ 2: మండలంలోని చందవరం, గొరిజవోలు, ఇర్లపాడు గ్రామాల్లో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో పెద్ద సంఖ్యలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కవాతులో నరసరావుపేట ట్రైనీ డీఎస్పీ జగదీష్, చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ జే బలరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుపై పిచికలపాలెం సర్పంచ్ శివకుమారి

శావల్యాపురం, ఏప్రిల్ 2: పిచికలపాలెం సర్పంచ్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తిరువీధి శివకుమారి అనారోగ్య కారణాలతో మంగళవారం సెలవు పెట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరిని కలసి సెలవు పెడుతున్నట్లు లిఖితపూర్వకంగా రాసి అందజేశారు. సెలవు పత్రాన్ని డీపీవోకి పంపి ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకొంటామని ఎంపీడీవో తెలిపారు.

పింఛన్లు ఇళ్ళ వద్దనే పంపిణీ చేయాలి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా నేరుగా పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమం నుంచి వలంటీర్ వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా ఇళ్ళ వద్దనే పంపిణీ చేయాలని ఎంపీడీవోకు టీడీపీ నేతలు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జువ్వాజి మదన్‌మోహన్, మద్దిరాల సర్పంచ్ మాలెంపాటి సుబ్బారావు, రావెళ్ళ రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

● వ్యవసాయశాఖ ఏడీఏ మస్తానమ్మ

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 2: రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని వ్యవసాయశాఖ ఏడీఏ పి.మస్తానమ్మ విత్తనాల దుకాణాల యజమానులకు సూచించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని స్టేషన్ రోడ్‌లోని వివిధ విత్తనాల షాపులు రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయం నుంచి ఏ మద్దిలేటి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, వ్యవసాయ అధికారి బీవీ సురేష్‌రెడ్డి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏ మద్దిలేటి విత్తనషాపులో డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులు తప్పనిసరిగా నాణ్యమైన విత్తనాలు ప్రభుత్వం గుర్తింపు పొందిన అధికృత డీలర్ల దగ్గర మాత్రమే చేయాలన్నారు. విత్తనాల షాపులలో స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు కచ్చితంగా ఏర్పాటుచేయాలని సూచించారు, లేకుంటే చర్యలు తీసుకుంటామని మద్దిలేటి హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా విత్తనాలు తీసుకున్న వెంటనే బిల్లులు పొందాలన్నారు. విత్తనాల షాపుల్లో స్టాక్ రికార్డ్స్, సర్టిఫికెట్లు అన్నీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బ్రహ్మయ్య, హరివినయ్, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

నాగలక్ష్మి కాయిర్ ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం

వినుకొండటౌన్, ఏప్రిల్ 2: స్థానిక వెల్లటూరు రోడ్డులోని నాగలక్ష్మి కాయిర్ ఇండస్ట్రీలో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇండస్ట్రీలో మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు, సంఘటనా ప్రాంతానికి చేరుకున్న సిబ్బంది, మంటలను అదుపుచేశారు. జరిగిన నష్టంపై ఎస్.ఎఫ్.వో నాగేశ్వరరావును వివరణ కోరగా సుమారు ఐదు లక్షల రూపాయల దాకా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు.

6వ తేదీన బార్ అసోసియేషన్ ఎన్నికలు

వినుకొండ, ఏప్రిల్ 2: వినుకొండ బార్ అసోసియేషన్ ఎన్నిలకలు ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు న్యాయవాద ఎన్నికల అధికారి చాగంటి వీరాంజినేయ చౌదరి మంగళవారం తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు పోటీకోసం కె.ఎస్.ఎం.వి నాయుడు, గంధం హరిప్రసాద్, ఎం.వి అప్పారావు, గరికపాటి సురేష్‌లు నామినేషన్ దాఖలుచేయగా, పోటీ నుంచి ఎం.వి అప్పారావు, గరికపాటి సురేష్‌లు నామినేషన్లు సోమవారం విత్‌డ్రా చేసుకున్నారు. అధ్యక్ష పదవికోసం కె.ఎస్.ఎం.వి నాయుడు, గంధం హరిప్రసాద్ లు పోటీలో ఉన్నారు, ఉపాధ్యక్షులుగా తలారి ఆంజనేయులు, గాలి నాగరాజు, సెక్రటరీగా పఠాన్ గౌస్ మొహిద్దీన్, శ్రీనునాయక్, జాయింట్ సెక్రటరీగా నీలం శ్రీహరిబాబు, యలవర్తి శ్రీనువాసరావు. ట్రెజరర్‌గా చీమకుర్తి బ్రహ్మం, చిరంజీవిలు పోటీలో ఉన్నట్లు వీరాంజినేయులు తెలిపారు.

పోటీ నుంచి తప్పుకున్న అప్పారావు

వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో తన నామినేషన్‌ను విత్‌డ్రా చేసినట్లు న్యాయవాది ఎం.వి అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 తేదీన జరిగే బార్ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడే ప్యానల్‌లోని జూనియర్ న్యాయవాదులను గెలిపించాలని కోరారు.